

దోమలు.. యమడేంజర్
▸ ప్రాణాంతక వ్యాధులకు కారకాలు
▸ నివారించకపోతే ప్రమాదమే
▸ లార్వా, ప్యూపా దశలోనే నాశనం చేస్తేనే మంచిది
▸ నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం 6



నేడు రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ప్రారంభం

వర్చువల్‌గా సీఎం.. మంత్రులు నిమ్మల, కందుల హాజరు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు సమీపంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌ఐటీహెచ్)ని బుధవారం సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్ ప్రత్యక్షంగా హాజరై శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ముఖాముఖి కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఏర్పాటుచేశారు. ఇక్కడ 147 పరిశ్రమల ప్రతినిధులు, 85 స్టార్టప్‌ల ఔత్సాహికులు, 950 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్ ప్రశాంతి మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆర్‌టీఐహెచ్ ద్వారా కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, పారిశ్రామిక భాగస్వామ్యాలు, స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ యాక్సిలరేషన్, పెట్టుబడి, ఫైనాన్సింగ్ వంటి అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువత, పారిశ్రామికవేత్తలు తమ ప్రతిభను ప్రదర్శించుకొనే హబ్‌గా ఆర్టీఐహెచ్ ఉపయోగపడనుందని చెప్పారు. ఆర్టీఐహెచ్ నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలోని ఏర్పాట్లపై సమీక్ష చేసి సమన్వయ శాఖలతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణ నాయక్, డీఆర్డీఏ పీడీ మూర్తి పాల్గొన్నారు.

దోమల నివారణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



దోమల నివారణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యఆరోగ్యశాఖ అధికారి దుర్గారావుదొర

అమలాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దోమల సంతానోత్పత్తి నివారణలో భాగంగా జిల్లాకు 2లక్షల గంబూజియా చేపలను మత్స్యశాఖ కేటాయించినట్టు వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర తెలిపారు. ఈనెల 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యశాఖాధికారి చాంబర్‌లో వరల్డ్ మస్కిటోడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. దోమల ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని కొనుగొన్న శాస్త్రవేత్త రొనాల్డ్ రాస్ చిత్రపటానికి ఈనెల 20న అన్ని పీహెచ్‌సీల్లో పూలమాలలువేసి నివాళులర్పించాలని దుర్గారావుదొర ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా మలేరియా నివారణపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈదరపల్లిలో గంబూజియా చేపల విడుదల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలో 38 పీహెచ్‌సీలు, 132 గ్రామాల్లోని 289 ఆవాసాల్లో 2లక్షల గంబూజియా చేప పిల్లలను విడుదల చేశామని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.నిర్మలకుమారి, ఎఫ్‌డీవో గోపాలరావు, మలేరియా అధికారి వెంకటేశ్వరరావు, యూనిట్ ఆఫీసర్ రాజకుమారి, రాజబాబు, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, రామారావు పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

బీ అలర్ట్



పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేపై వాహనదారుల ఇబ్బందులు

▸ కోనసీమ నదీ పాయలకు పెరుగుతున్న వరద ఉధృతి
▸ పి.గన్నవరంలో కనకాయలంక కాజ్‌వేపైకి చేరిన వరదనీరు
▸ ముక్తేశ్వరం-కోటిపల్లి రేవులో ప్రయాణాలు ఇప్పటికే బంద్
▸ సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో పెరిగిన రద్దీతో అప్రమత్తం
▸ రానున్న రెండురోజుల్లో వరద మరింత ఉధృతమయ్యే అవకాశం

అమలాపురం,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):గోదావరి వరదలు ఉగ్రరూపం దాలుస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ప్రధాన గోదావరి నదులు పొంగి ప్రవస్తుండడంతో లంక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. కాజ్‌వేలపై వరద నీరు చేరుతోంది. రాత్రికి వరదఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని జలవనరులశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. భద్రాచలం, ధవళేశ్వరంవద్ద ఉధృతి కొనసాగుతుండడంతో మంగళవారం కోనసీమలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధ గౌతమీ నదీపాయలు పొంగుతున్నాయి.

రహదారులపై వరదనీరు

జిల్లాలో వరద ఉధృతి పెరుగుతుండడంతో రెవెన్యూ అధికారులను, ఆర్డీవోలను కలెక్టర్ మహేష్‌కుమార్ అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాల్సిందిగా ఆదేశాలిచ్చారు. ధవళేశ్వరం నుంచి 8లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదలడంతో నదీపాయలు పొంగుతున్నాయి. పి.గన్నవరం మండలంలోని గంటిపెదపూడినుంచి నాలుగుగ్రామాలకు వెళ్లే రహదారి జలదిగ్బంధానికి గురికావడంతో లంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణాలు చేస్తున్నారు. ఉమ్మడిఉభయగోదావరి జిల్లాలను కలిపే కనకాయలంక కాజ్‌వేపై వరదనీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. కోనసీమలోని తొగరపాయ పాతవంతెన వద్దకు వరద ప్రవాహం చేరింది. వీటితోపాటు నదీపరివాహక లంక గ్రామాల్లోకి వరదనీరు పోటెత్తుతుండడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమై ఆయా గ్రామాల్లో పర్యటించి వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్ర పరిధిలోని ముంబైలో కురుస్తున్న భారీవర్షాల ప్రభావంతో గోదావరినదికి వరద ఉధృతి పెరిగే అవకాశంఉన్న దృష్ట్యా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కోటిపల్లి-ముక్తేశ్వరం రేవులో పంటు ప్రయాణాలు నిలిచిపోయాయి.ఇటీవల వరదలకు ముక్తేశ్వరం వైపు వేసిన గట్టు తెగిపోవడంతో ఈపరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు తాజాగా చించినాడ బ్రిడ్జి మరమ్మతుల కారణంగా వశిష్ఠ నదిపై ఉన్న సఖినేటిపల్లి-నర్సాపురం రేవు వద్ద ప్రయాణికుల రద్దీ పెరిగిన దృష్ట్యా పంటు నిర్వాహకులు ప్రత్యేకజాగ్రత్తలు చేపట్టాలని రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులను ఇప్పటికే ఆదేశాలిచ్చారు. మహారాష్ట్రలో భారీవర్షాల నేపథ్యంలో రానున్న రెండు, మూడురోజుల్లో వరద ఉధృతి అనూహ్యంగా పెరిగే అవకాశంఉందన్న జలవనరులశాఖహెచ్చరికలతో కోనసీమ లంకగ్రామాల ప్రజలు ముందస్తు జాగ్రత్తల్లో ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

గోదావరి వరదలు పెరుగుతున్న దృష్ట్యా జిల్లాలోని నదీపరివాహక లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సహాయకచర్యలు చేపట్టేందుకు యంత్రాంగం సన్నద్ధం కావాలని, ఏ విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి హెడ్‌వర్క్స్ ఇంజనీర్లు నదీ పరివాహక ఏటిగట్లలో బలహీన ప్రాంతాలను గుర్తించి ఇసుక బస్తాలు, ఇతర రక్షణచర్యలు చేపట్టేందుకు సిద్ధంగా కావాలని ఆదేశాలిచ్చారు. వరద ఉధృతి పెరిగితే లంక గ్రామాల్లో ముంపు బారిన పడేవారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, పడవలు, లైఫ్ జాకెట్లతో సిద్ధం చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు.గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ముంపు బాధితులకు ఆహారం, సురక్షితమైన తాగునీరు, పునరావాస కేంద్రాలు వసతి, ఇతర ఏర్పాట్లు వంటి ఇతర అంశాలపై ఆర్డీవోలు దృష్టిపెట్టి తగిన రీతిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.



కె.గంగవరంలోని కోటిపల్లి పుష్కరాల రేవు మెట్ల వరకూ చేరుకున్న వరద

నేటి నుంచి న్యాయ విభాగ ఉద్యోగుల..

నియామక పరీక్షలు

▸ జిల్లాలో రెండు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
▸ ప్రతిరోజూ మూడు షిఫ్ట్‌ల్లో పరీక్షలు
▸ జిల్లాలో 3,195మంది అభ్యర్థుల హాజరు
▸ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



అమలాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జ్యుడీషియల్ స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఎగ్జామినర్, కాపీయిస్ట్, డ్రైవర్‌తో సహా ఇతర విభాగాలకు సంబంధించిన ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల నియామక ఆధార పరీక్షలు ఈనెల 20వతేదీ నుంచి నాలుగురోజులపాటు జరగనున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరు పరీక్షా కేంద్రాల్లో న్యాయ విభాగంలో జరిగే ఈ నియామక పరీక్షలకు 25,173మంది హాజరు కానున్నారని ఆమె తెలిపారు. షిఫ్ట్‌ల వారీగా పరీక్షా సమయాలు ఉంటాయని, షిఫ్ట్ రిపోర్టింగ్ సమయం, గేట్ క్లోజ్, లాగిన్ పరీక్ష ప్రారంభం, ముగింపు వివరాలకు అదనంగా కోర్టు అధికార ప్రతినిధి, పరీక్షా నిర్వాహకులు గుర్తించిన దివ్యాంగుల కోసం అరగంట అదనపు సమయం ఇవ్వనున్నట్టు న్యాయమూర్తి తెలిపారు. దివ్యాంగులకు సహాయకారి అవసరం ఉంటే ఆయా పరీక్షా కేంద్రాల్లో తగిన ఆధారాలు చూపించి అర్హత కలిగిన వారికి ఆ మేరకు అనుమతి తీసుకోవాలని వెల్లడించారు.

దివ్యాంగులకు అదనంగా అరగంట

కోనసీమ జిల్లా పరిధిలో పరీక్షా కేంద్రాల వివరాలను వెల్లడించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో 1710మంది అభ్యర్థులు, 22, 23, 24 తేదీల్లో పరీక్షలకు హాజరు కానున్నారు. అమలాపురం రూరల్ మండలం భట్లపాలెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో 1485మంది అభ్యర్థులు మూడురోజులు జరిగే పరీక్షలకు హాజరవుతారు. మొదటి షిఫ్ట్ ఉదయం 7.30 నుంచి 8.45 గంటల వరకు అభ్యర్థులను అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభ సమయం ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు దివ్యాంగులకు అదనంగా అరగంట కేటాయించి 11 గంటల వరకు కొనసాగుతుందని సునీత తెలిపారు. రెండో షిఫ్ట్ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు అభ్యర్థులను అనుమతిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు పరీక్షా సమయం కాగా అదనంగా మరో అరగంట 2.30 గంటల వరకు దివ్యాంగులను పరీక్షకు అనుమతిస్తారు. మూడో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 నుంచి 3.45 గంటల వరకు అభ్యర్థులను అనుమతించడం, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం, దివ్యాంగులకు అదనంగా మరో అరగంట కేటాయించి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. హాల్‌టెక్కెట్లు డౌన్‌లోడ్ సమస్యల కోసం హెల్ప్‌డెస్క్ ఫోన్ నెంబరు 0863-2372752ను సంప్రదించాలని జిల్లా న్యాయమూర్తి సునీత తెలిపారు.

25న అమలాపురంలో చాయ్‌పే చర్చా కార్యక్రమం

▸ ముఖ్యఅతిథిగా హాజరుకానున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అమలాపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అమలాపురం బస్టాండు సెంటర్‌లో ఈనెల 25న బీజేపీ ఆధ్వర్యంలో చాయ్‌పే చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. చాయ్‌పే చర్చా కార్యక్రమం అనంతరం గడియార స్తంభం సెంటర్‌వరకు శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. బీజేపీ జిల్లాశాఖ విస్తృత స్థాయి సమావేశం సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం అమలాపురం సత్యనారాయణ విలాస్‌లో నిర్వహించారు. సమావేశానికి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు పాతరేసిన వైసీపీ నాయకుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తొలిసారిగా పులివెందులలో స్వేచగా ఎన్నికలు నిర్వహించారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు మానేపల్లి అయ్యాజీవేమా, జిల్లాఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహన్, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, బీజేపీ జిల్లాశాఖ మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు,నాయకులు తమనంపూడి రామకృష్ణారెడ్డి, కర్రి చిట్టిబాబు, పాలూరి సత్యానందం, మాలే శ్రీనివాసనగేష్, శ్రీనివాసరావు, వీరబాబు, దత్తాత్రేయ, బాషా పాల్గొన్నారు.

పుస్తకాల్లో పరీక్ష!

▸ విద్యార్థుల ప్రగతిని సులువుగా గుర్తించేందుకు తరగతుల వారీగా మూల్యాంకనం పుస్తకాలు
▸ పరీక్షా విధానంలో విద్యాశాఖ సంస్కరణలు

అమలాపురంరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో ఒక్కొక్కటిగా మార్పులు తీసుకు వస్తోంది. దీనిలోభాగంగా విద్యాశాఖఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకోసం మూల్యాంకనం పేరిట మరో సంస్కరణకు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల ప్రగతిని సులువుగా గుర్తించేందుకు మూల్యాంకన పుస్తకాలు దోహదపడనున్నాయి. ప్రతి విద్యార్థికి తరగతులవారీగా సబ్జెక్టుల ప్రకారం మూల్యాంకనం పుస్తకాలను ప్రభుత్వమే సరఫరా చేసింది. ప్రభుత్వ పరీక్షల విభాగం అందించే ప్రశ్నాపత్రాలకు సంబంధించిన జవాబులను ఇందులోనే రాయాల్సి ఉంటుంది. గతంలో యూనిట్ టెస్టుల నుంచి త్రైమాసిక, అర్ధ సంవత్సర, సంవత్సరాంతర పరీక్షలకు జవాబులన్నీ ఎప్పటికప్పుడు విద్యార్థులు తెల్ల కాగితాలపై రాసేవారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి చెప్పి విద్యా సంవత్సరంలో జరిగే పరీక్షలకు సంబంధించిన జవాబులన్నీ ఆ మూల్యాంకనం పుస్తకాల్లోనే రాయాల్సి ఉంటుంది.

విద్యార్థి భవిష్యత్తు పుస్తకంలోనే..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థి భవిష్యత్తును పరీక్షలవారీగా ఎప్పటికప్పుడు మూల్యాంకనం పుస్తకంలోనే నిక్షిప్తం చేస్తారు. ఆ పుస్తకంలోనే గణితం సబ్జెక్టుకు సంబంధించి గ్రాఫ్‌లు ఉంటాయి. సాంఘికశాస్త్రానికి సంబంధించి మ్యాప్‌లు ఉంటాయి. ఇక ఓఎంఆర్ షీట్లు అందులోనే. ఇలా ఆ పుస్తకాన్ని తెరిచి చూడగానే ప్రతి విద్యార్థి ప్రగతి ఎప్పటికప్పుడు అర్థమవుతుంది. విద్యాశాఖ ఉన్నతాధికారుల తనిఖీ సమయంలో వారి ప్రగతి సులువుగా అర్థమవుతుంది.

జిల్లాలో 1566 పాఠశాలలకు సరఫరా

జిల్లాలో 1 నుంచి 5 తరగతులకు సంబంధించిన ప్రాథమిక పాఠశాలలు 1276 ఉన్నాయి. ఉన్నత పాఠశాలలు 290, మొత్తం 1566 ప్రభుత్వ పాఠశాలల్లో 89,262మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ ఇప్పటికే తరగతులవారీగా సబ్జెక్టులవారీగా 5,03,523 మూల్యాంకన పుస్తకాలను ప్రభుత్వం అందించింది. గతేడాది నుంచి సమ్మెటీవ్ అసెస్‌మెంట్ పరీక్షలను ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలుగా మార్చారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ 1, 2, 3, 4గా నిర్ణయించారు. 2025-26 విద్యాసంవత్సరంలో 4 సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు, 2 సమ్మెటీవ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే తొలి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షను నిర్వహించారు.

తరగతులవారీగా..

రెండో తరగతి విద్యార్థులకు 3మూల్యాంకనం పుస్తకాలు సబ్జెక్టులవారీగా అందించారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు నాలుగు, 6 నుంచి 7వ తరగతి విద్యార్థులకు ఆరు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏడు మూల్యాంకన పుస్తకాలు అందించారు.ఏడాది మొత్తం జరిగే పరీక్షల జవాబులన్నీ ఈ మూల్యాంకనం పుస్తకాల్లోనే రాయాల్సి ఉంటుంది. ఆయా పుస్తకాలను భద్రపరిచే బాధ్యత సంబంధిత సబ్జెక్టు టీచర్లదే. గతంలో పేపర్లపై మార్కుల నమోదుతో ఉపాధ్యాయుల బాధ్యత తీరేది. ఇప్పుడు మూల్యాంకనం పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లే పరిస్థితి లేదు. వాటిని భద్రపరచడం తలకుమించిన భారమని పలువురు ఉపాధ్యాయులు చెప్తున్నారు. పరీక్షలు రాసిన తర్వాత ఓఎంఆర్ షీట్లో మార్కులు వేయాలి. ఓఎంఆర్ షీట్లను విద్యాశాఖ ఇచ్చిన యాప్‌లో ఉపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలి. ఈ విధానం ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తుందని కొందరు అంటుంటే మార్పును స్వాగతించాలని మరికొందరంటున్నారు.

చేతికి 'స్మార్ట్'గా..



ఈనెల 25 నుంచి ఉమ్మడి జిల్లాలో కొత్త స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. పాత, కొత్త లబ్ధిదారు లందరికీ కలిపి ఒకేసారి వీటిని నియోజకవర్గాలు, మండలాల్లో అందించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ ఫొటోతో చాంతాడంత రేషన్‌కార్డు జారీ చేసి వైసీపీ సొంత ప్రచారం చేసుకుంది. దీని స్థానంలో ఇప్పుడు కొత్తగా ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డు ఇవ్వబోతోంది. అచ్చం ఏటీఎం కార్డు తరహాలో ఉండే కార్డులపై కేవలం లబ్ధిదారుడి పేరు, ఫొటో మాత్రమే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. అలాగే కొత్త కార్డుదారులకు సైతం ఈనెల నుంచే రేషన్ పంపిణీ చేయనున్నారు.

▸ కొత్త స్మార్ట్ రేషన్ కార్డులొచ్చేస్తున్నాయ్
▸ ఈనెల 25 నుంచి మండలాల వారీగా పంపిణీ చేయనున్న ప్రభుత్వం
▸ ఉమ్మడి జిల్లాలో 17.41 లక్షల పాతకార్డుల స్థానంలో కొత్తవి అందజేత
▸ ఇటీవల దరఖాస్తు చేసుకున్న వారిలో 34 వేల మంది కొత్త లబ్ధిదారులకూ
▸ కార్డులపై లబ్ధిదారుడి ఫొటో, కుటుంబ సభ్యుల పేర్లు.. కొత్తవారికీ రేషన్
▸ ఏటీఎం కార్డు తరహాలో ఉండే రైస్‌కార్డులపై క్యూఆర్ కోడ్‌లు కూడా


(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలు పేరుతో ఎడాపెడా లబ్ధిదారులను కోసేశారు. రకరకాల నిబంధనల పేరుతో చివరకు రేషన్‌కార్డులను సైతం భారీగా ఏరేశారు. పలు పథకాలకు రేషన్‌కార్డు అర్హత కావడంతో పెరిగిన ఆర్థిక భారాన్ని తప్పించుకోవడానికి కార్డులను గుట్టుచప్పుడు కాకుండా అప్పటి ప్రభుత్వం ఏరేసింది. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 15.69లక్షల తెల్లకార్డులుండగా, వీటిలో అనర్హులు అధికంగా ఉన్నారని భావించి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లాల పౌరసరఫరాలశాఖలకు పంపి గుట్టుగా క్షేత్రస్థాయి తనిఖీలు చేసి కార్డులు రద్దుచేసింది. 17,500 మంది కార్డుదారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో వాటినీ రద్దు చేసేశారు. కొత్తగా వివాహం అయిన దంపతులు, కార్డు ఉండి కొత్తగా పిల్లలున్న వారు ఇలా అనేక విభాగాల్లో కార్డులు జారీ చేయడం, మార్పులు చేర్పులు చేయాల్సి ఉన్నవి వేలల్లో ఉన్నా అదేం పట్టించుకోలేదు. చిరుద్యోగాలు చేసుకునేవారు తమ తల్లిదండ్రుల కార్డుల్లోంచి తమపేర్లు తొలగించాలని కోరినా ఏవేవో కారణాలు చూపి పథకాలను నిలిపివేసింది. దీంతో జనం రేషన్ కార్డుల విషయంలో పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అనేకసార్లు ప్రజలు అప్పట్లో గ్రీవెన్స్‌సెల్‌లో కూడా భారీగా కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్తవి మంజూరు చేయాలంటూ వినతులు అందించినా జగన్ సర్కారు చెవికెక్కించుకోలేదు. మరోపక్క అప్పట్లో ఉన్న రేషన్‌కార్డులను రద్దుచేసి ఏకంగా అప్పటి సీఎం జగన్ ఫొటోతో కార్డులు జారీచేసింది. ప్రతి కార్డుదారుడికి జగన్ ఫొటోతో కాగితం ముక్క చేతిలో పెట్టింది. తద్వారా రాజకీయంగా ఈ కార్డుల ద్వారా లబ్ధిపొందేందుకు ప్రయత్నించింది. అయితే ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టాలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టడానికి పచ్చజెండా ఊపారు. అదే సమయంలో రేషన్‌కార్డులను స్మార్ట్ కార్డుల రూపంలో జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర అధికారులు కలిపి ప్రభుత్వ ఆమోదంతో స్మార్ట్‌కార్డుల జారీకి నిర్ణయించారు. ఈ కొత్తకార్డులపై గత ప్రభుత్వం తరహాలో సీఎం బొమ్మ లేకుండా కేవలం కార్డుదారుడి ఫొటోలే ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్డులపై కార్డుదారుడి పేరు, చిరునామా, మిగిలిన సభ్యుల పేర్లు ఉండేలా వీటిని తీర్చిదిద్దారు. ప్రస్తుతం వీటి ముద్రణ దాదాపు పూర్తయింది. వీటిని ఈనెల 23లోగా జిల్లాలకు ప్రభుత్వం పంపనుంది. వీటిని ఈనెల 25 నుంచి జిల్లాస్థాయిలో మంత్రి, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అటు మండలాల్లోను సమాంతరంగా కొత్తస్మార్ట్‌కార్డులను లబ్ధిదారులకు అందించనున్నారు. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో 6,41,533, తూర్పుగోదావరి జిల్లాలో 5,63,089, కోనసీమ జిల్లాలో 5,36,575 కార్డుదారులున్నారు. వీరందరికి కొత్తస్మార్ట్ కార్డులు అందజేయనున్నారు.

మరో 34 వేల మందికి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంత మొత్తుకున్నా పేదలకు కొత్త రేషన్‌కార్డుల జారీ పెద్దగా ఇవ్వలేదు. మార్పులు, చేర్పులను సైతం పట్టించుకోలేదు. దీంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొత్తకార్డులకు ప్రభుత్వం మే 14 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో రేషన్‌కార్డుల కోసం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించింది. కొత్తగా వివాహం అయినవారు, ఇప్పటివరకు రేషన్‌కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైనవారు.. ఇలా ఏడు రకాల సేవల కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డులు కావాలంటూ వేలాదిమంది దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన అర్జీల్లో అత్యధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఉన్నాయి. వీటన్నింటిని సచివాలయాల స్థాయిలో వీఆర్వో నుంచి తహశీల్దార్ల వరకు ఆ అర్జీలను పరిశీలించి మార్పులు చేర్పుల ప్రక్రియ పూర్తి చేశారు. అందులోభాగంగా కాకినాడ జిల్లాకు కొత్తగా 13 వేలు, కోనసీమ 11 వేలు, తూర్పుగోదావరి 10 వేల కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరుచేసింది. వీరికి కూడా ఈనెల 25 నుంచే స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. అటు రేషన్ కూడా ఈ నెల్లోనే కొత్తకార్డుదారులు పొందవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మరోపక్క కొత్త రేషన్‌కార్డులను రైస్‌కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. వీటిని పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటికి క్యూ ఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలు ఎలా ఉన్నాయి? డబ్బులు అడుగుతున్నారా? వంటి ఫిర్యాదులను సైతం క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తెలపవచ్చు. ఎలాంటి ప్రచార్భాటం లేకుండా ప్రభుత్వ చిహ్నంతో కార్డుల అందజేతపై హర్షం వ్యక్తమవుతోంది.

దోమలు.. యమ డేంజర్!



నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

- ప్రాణాంతక వ్యాధులకు కారకాలు
- నివారించకపోతే ప్రమాదమే
- లార్వా, ప్యూపా దశలోనే నాశనం చేస్తేనే మంచిది

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): చిన్నదోమ ఎంతో పెద్ద ప్రమాదాన్ని తీసుకువస్తుందో చెప్పడానికి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా లాంటి జ్వరాలే ఉదాహరణ. పట్టణాలతో పాటు పల్లెల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవలకాలంలో డెంగీ, మలేరియా కేసుల సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగాల బారిన పడిన వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రపంచానికి ఉమ్మడి శత్రువుగా మారిన దోమల ఆట కట్టించడానికి సర్‌రోనాల్డ్ రాస్ శతాబ్దం క్రితమే రంగంలోకి దిగారు. 1897లో ఆయన దోమల ద్వారానే మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని నిర్ధారించారు. ఈ పరిశోధనకు గాను ఆయనకు నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఈ సందర్భంగా ఆగస్టు 20న అంతర్జాతీయ దోమల నివారణ దినోత్సవంగా లండన్ స్కూల్ ఆఫ్ హైజెనిక్ అండ్ ట్రాపికల్ మెడిసన్ ప్రకటించింది. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



దోమలు అరికట్టేదేలా?

దోమ ఎగురుతున్నప్పుడు పట్టుకోవడం, చంపడం కష్టమైన పని. ఒక్క దోమను పట్టుకోవాలంటే ఎంతో శ్రమించాలి. దోమలు నీటిలో లార్వా, ప్యూపా దశలో పెరుగుతున్నప్పుడు నాశనం చేయడం సులువు. ఇవి ఇంటిలో నీటిని నిల్వ చేసే కుండీల్లో చిన్నచిన్న పురుగుల్లా కనిపిస్తుంటాయి. వాటిని చాలా మంది నీటిపురుగులు, జలగలు అని కూడా పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు లార్వా నిల్వ నీటిలో ఉన్నట్లయితే ఆ నీటిని మట్టిలేదా ఇసుకలో పారబోయాలి.ఇలా చేయడంవల్ల లార్వాపూప్యా దశల్లో ఉన్న వాటిని వందల సంఖ్యల్లో నాశనం చేయవచ్చు. దోమలు నిల్వఉన్న నీటిలో గుడ్లు పెడతాయి. ఒక దోమ 100 నుంచి 200 వరకు గుడ్లను పెడుతుంది. ఇవన్నీ కేవలం 8 నుంచి 10 రోజుల్లోగా దోమలుగా మారిపోతాయి. గుడ్డు నుంచి లార్వా ప్యూపా, అడల్ట్ మస్కిటోగా రూపాంతరం చెందుతుంది. దోమలు వ్యాప్తి చెంది చిన్న, పెద్ద తేడా లేకుండా రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దోమల దాడిని తట్టుకునేందుకు ప్రతినెల నిత్యావసరాల మాదిరిగానే లిక్విడ్స్, మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ లేదా మస్కిటో బ్యాట్ వంటి వాటికి ఖర్చుచేస్తున్నారు. దోమకాటుకు గురైన వ్యక్తి రోగాల బారిన పడడంతో ఆస్పత్రుల పాలై వేల కు వేలు ఖర్చు చేయక తప్పడంలేదు.

ఆడదోమలే ప్రమాదకరం

మగదోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతాయి. ఆడదోమలు మాత్రం సంతానాభివృద్ధిలో భాగంగా గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీలుస్తాయి. ఈక్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ రక్తాన్ని పీల్చినప్పుడు రక్తంతోపాటు వ్యాధికారకమైన పారాసైట్ దోమ లాలాజల గ్రంథుల్లోకి చేరుతుంది.ఈ పారాసైట్‌లో కొన్నిమార్పులు జరుగుతాయి. మరో ఆరోగ్యవంతమైన వ్యక్తిని దోమ కుట్టినప్పుడు లాలాజలంతోపాటు పారాసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులకు కారణమవుతుంది. ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడంవల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గూన్యా లాంటి జ్వరాలు, ఈడిస్, క్యూలెక్స్ దోమలు కుట్టడంవల్ల బోదకాళ్లు వస్తాయి.

నివారణ ఇలా..

దోమలు కుడితే ఎంతటి ప్రాణాంతక విషజ్వరాలు ప్రబలుతాయో అందరికీ తెలిసిందే. మలేరియా, డెంగీ వంటి జ్వరాలకు దోమలే కారణం. మస్కిటో రీఫిల్స్, కాయిల్స్ వంటివి దోమల నివారణకు ఇంట్లో వాడుతాం. వాటివల్ల కొందరికి శ్వాసకోస వ్యాధులు వస్తాయి. ఈ నేపథ్యంలో దోమల నివారణకు సహజ పద్ధతిలో చర్యలు చేపట్టడమే ఉత్తమం. వేపనూనె దోమలను తరిమికొట్టడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. దీని వాసన దోమలు భరించలేవు. వేప, కొబ్బరి నూనెలను సమాన భాగాలుగా చేసుకుని బయటకు కనిపించే శరీర భాగాలపై రాసుకుంటే దోమలు దరిచేరవు. ఇళ్లలోకి దో మలు ప్రవేశించే కిటికీల వంటి ద్వారాలవద్ద తులసీమొక్కలను పెంచాలి. ఇవి దోమలను దూ రం చేస్తాయి. వృద్ధి కాకుండా చేస్తాయి. లెమన్, యూకలిప్టస్ ఆయిల్ మిశ్రమం దోమలను తరిమికొడుతుంది. ఇది సహజసిద్ధమైన యాంటీ సెప్టిక్‌గానే కాకుండా ఇన్‌సెక్ట్ రిప్లెంట్ గాను పనిచేస్తుంది. కర్పూరం మెరుగ్గా పనిచేస్తుంది. ఖాళీ ప్రదేశాలను మూసిన తర్వాత కర్పూరాన్ని వెలిగిస్తే దాని నుంచి వచ్చే పొగకు దోమల మాయమవుతాయి.



అప్రమత్తంగా ఉండాలి

దోమలనుంచి వచ్చే వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మలేరియా,డెంగీ వంటి వ్యాధులు ప్రస్తుతం తగ్గుముఖం పడుతున్నాయి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. డెంగ్యూ, మలేరియాలపై ప్రజల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాం.

-ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి, ముమ్మిడివరం


దోమల వ్యాప్తిపై వివరిస్తున్న మలేరియా అధికారి



విద్యుత్ అధికంగా వాడుతున్నారా?

- అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు అవకాశం
- 'వీడీఎస్ వలంటరీ డిస్‌క్లోజర్ స్కీమ్'ను తీసుకొచ్చిన విద్యుత్‌శాఖ
- స్వచ్ఛందంగా అదనపు లోడ్ వెల్లడించే పథకం
- ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు గడువు పొడిగింపు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 26,460 దరఖాస్తుల రాక

(ఆంధ్రజ్యోతి- కాకినాడ)

'విద్యుత్ వినియోగంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించి, అధిక లోడ్ వినియోగదారులపై కేసులు నమోదు చేస్తాం. ఫైన్‌లు వేస్తాం. గృహ వినియోగదారులు లోడు క్రమబద్ధీకరించుకుంటే హెచ్చుతగ్గులుండవు.' ప్రస్తుతం విద్యుత్‌శాఖ అధికారులు చేస్తున్న ప్రచారమిది. విద్యుత్ వినియోగదారుల అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు కాకినాడ సర్కిల్ పరిధిలో మొత్తం 6,998, తూర్పుగోదావరి జిల్లాలో 10,199, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో 9,263 దరఖాస్తులు వచ్చాయి. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 26,460 దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి గృహ విద్యుత్ వినియోగంలో విద్యుత్ వాడకానికి సంబంధించి అదనపు విద్యుత్ వాడుతున్న వినియోగదారులకు స్వచ్ఛంద అదనపు లోడ్ వెల్లడి పథకం (వీడీఎస్ వలంటరీ డిస్‌క్లోజర్ స్కీమ్)ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. వినియోగదారులు వారు వాడుతున్న విద్యుత్ వాడకాన్ని అనుసరించి అదనపు లోడ్ ఏర్పాటు చేసుకోవడానికి 50శాతం సబ్సిడీ కల్పిస్తోంది. విద్యుత్ వినియోగదారుల నుంచి ఈ మేరకు చార్జీలు వసూలు చేస్తోంది. ఈ విద్యుత్ రాయితీకి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ తేదీ జూన్ 30 అని తొలుత ప్రకటించినా.. ఆ గడువును డిసెంబర్ నెలాఖరు వరకు పొడిగించింది. సాధారణంగా ఒక కిలోవాట్‌కు దరఖాస్తు ఫీజు రూ.50, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఏపీఈపీడీసీఎల్ ప్రకటించిన వీడీఎస్ పథకంలో కిలోవాట్‌కు రూ.1250, రెండు కిలోవాట్లకు రూ.2450, మూడు కిలోవాట్లకు రూ.3,650 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఈ మేరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అంటే 50 శాతం రాయితీతో లోడు క్రమబద్ధీకరించుకునే అవకాశం ఇచ్చారు. కాకినాడ జిల్లాలో 6,68,126 మంది వినియోగదారులు ఉన్నారు. వాణిజ్య, వ్యాపార, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయ, ఆక్వా ఇతర అనుబంధ రంగాల కేటగిరీలో మరో లక్షా 25 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కాకినాడ సర్కిల్‌లో జగ్గంపేట డివిజన్ (జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని సబ్ డివిజన్లు) 1510 దరఖాస్తులు, కాకినాడ డివిజన్(కాకినాడ, కరప, సర్పవరం సబ్‌డివిజన్లు) 3212 దరఖాస్తులు, పెద్దాపురం డివిజన్ (పిఠాపురం, సామర్లకోట సబ్‌డివిజన్లు) 2276 ఇలా మొత్తం కాకినాడ సర్కిల్‌లో 6998 దరఖాస్తులు వచ్చాయి. 11558.99 కిలోవాట్ల అదనపు లోడు కోరుతూ ఇవి వచ్చాయి. డెవలప్‌మెంట్ చార్జీల కోసం రూ.107.41 లక్షలు, సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.24.21 లక్షలు, ఎస్ఎల్‌సీ రూ.2.31 లక్షలు వసూలైంది. వాస్తవానికి విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇలా అందరి ఇళ్లల్లోనూ కనిపిస్తున్నాయి. నిర్దేశించిన లోడు కన్నా ఎక్కువ వాడుతున్నారు. అదనపు లోడ్ భారం ట్రాన్స్‌ఫార్మర్లపై పడి తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇలాంటి సమస్యలు అధిగమించేందుకే ఈపీడీసీఎల్ గృహ విద్యుత్ వినియోగదారు లకు లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తోంది.

ఒక్కో జిల్లాకు కోటి

- వరద సహాయక చర్యలకు ఉమ్మడి జిల్లాకు రూ.3కోట్లు
- తక్షణ చర్యలకు వెచ్చించాలని ప్రభుత్వం ఆదేశాలు
- సురక్షిత ప్రాంతాలకు వరద బాధితులను తరలించాలని సూచన

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బాధిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా నిధులు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాకు రూ.కోటి చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.3కోట్లు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో వర్షాలు, వరద ప్రాంతాల్లో బాధితులకు ఆహారం, వైద్య సేవలు అందించాలని కలెక్టర్లను ఆదేశించింది. ఆర్టీసీ బస్సులను తరలించి వరద ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించింది. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ సంస్థ అధికారులు వర్షాలు, వరద ముప్పు ప్రాంతాల జిల్లాల కలెక్టర్లతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు. అటు గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కోనసీమ జిల్లాలో నాలుగు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

డ్రగ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండండి

- ఐజీ, ఈగల్ చీఫ్ రవికృష్ణ
- నన్నయ యూనివర్శిటీలో యాంటీ ర్యాగింగ్ వారోత్సవం, ఈగల్ డ్రగ్స్ చైతన్య కార్యక్రమం


ఈగల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐజీ రవికృష్ణ, వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవం, ఈగల్ డ్రగ్స్ చైతన్య కార్యక్రమం మంగళవారం జరిగింది. దీనికి ఐజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తాను రాజమహేంద్రవరంలో పుట్టి పెరిగి, ఇక్కడే విద్యాభ్యాసం పూర్తిచేశానని, నన్నయ యూనివర్శిటీకి రావడం ఆనందంగా ఉందన్నారు. నేటి సాంకేతిక యుగంలో భయం, దురాశ, వ్యామోహం, అవమానం వంటివి సైబర్‌నేరాల పెరుగుదలకు కారణాలు అవుతున్నాయని చెప్పారు. దీని పట్ల యువత అవగాహన కలిగి ఉండి సమాజానికి, పెద్దలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాలపై సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబరు 1930కు తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో నేరాలకు అడ్డాగా ఉన్న ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని పదేళ్ల నుంచి నేరాలు లేకుండా అరికట్టి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత విషయం కాదని, కుటుంబాల భవిష్యత్తును క్షీణింపజేసే సామాజిక అంటువ్యాధి అని అన్నారు. యువత మనస్సులు నూతన ఆవిష్కరణలు, నాయకత్వం, ప్రేరణ కోసం ఉద్దేశించబడాలన్నారు. ఈగల్ ఎస్పీ కె.నగేష్‌బాబు మాట్లాడుతూ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహలను ఐజీ నివృత్తి చేశారు. డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటామని, వాటి జోలికి పోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ రూపొందించిన డ్రగ్స్, సైబర్‌నేరాల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ కేవీ స్వామి, సౌతోజోన్ డీఎస్పీ భవ్యశ్రీ, ఈగల్ డీఎస్పీ పి.సూర్యమోహనరావు, నన్నయ డీన్ ఆచార్య ఎన్.ఉదయభాస్కర్, న్యాయాధికారి నాగేంద్ర పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్ల నిధులు

- మాల వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ విజయకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ యువతకు నైపుణ్యాల శిక్షణ,ఉపాధి కల్పనలకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్ల నిధులు కేటాయించిందని రాష్ట్ర మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ తెలిపారు. మంగళవారం కాకినాడ జిల్లాలో పర్యటించిన ఆయన ఉదయం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతోను, ఎస్సీ మాల సంక్షేమ, యువజన సంఘాలతో సమావేశమై కార్పొరేషన్ ద్వారా చేపట్టవలసిన కార్యాచరణపై చర్చించి, సూచనలు, సలహాలు స్వీకరించారు. మధ్యాహ్నం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో ఈ సంవత్సరం 26,200 మందికి ఉపాధి రుణాలు కల్పించే ప్రణాళిక అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ యువతకు నైపుణ్యాల శిక్షణ, అభివృద్ధి లక్ష్యంగా నాక్ సంస్థ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎస్సీ యువతలో ఆర్థిక అక్షరాస్యతను, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను పెంపొందించి 2047 నాటికి ఎస్సీ కుటుంబాల్లో ప్రతీ ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్త,పారిశ్రామికవేత్త ఉండేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ఆర్థిక సహాయ కార్యక్రమాలను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు.జిల్లాలో వనరుల ఆధారంగా ఎస్సీ మాలల ఆర్థిక ప్రగతికి లోకలైజ్డ్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామని చైర్మన్ విజయ్‌కుమార్ చెప్పారు. సమావేశంలో మాల వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు దానం లాజర్ బాబు, కొల్లాబత్తుల అప్పారావు, చెల్లు అశోక్, మద్దా మణి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.సత్యవతి, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు


సామర్లకోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కలెక్టర్ షాన్‌మోహన్ తదితరులు

పెద్దాపురం/సామర్లకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 23న పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ షాన్ మోహన్, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పట్టణంలోని మానోజ్ చెరువు, ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉందన్నారు.అలాగే సామర్లకోట పట్టణ శివారులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగే సీఎం ప్రజా వేదిక సభ ఏర్పాట్లను కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే చిన రాజప్ప, అధికారులు పరిశీలించారు. అదే ఆవరణలో టీడీపీ కార్యకర్తల సమావేశం కూడా జరుగుతుందని సమాచారం. కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ కార్పొరేషన్ కమిషనరు భావన, డీఆర్వో వెంకటరావు, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఏఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, పీసీబీ కార్యనిర్వాహక ఇంజనీర్ శంకరరావు, డీపీవో వి.రవికుమార్, సీపీవో త్రినాథ్, ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున, తహశీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, సామర్లకోట కమిషనరు శ్రీవిద్య పాల్గొన్నారు.

తగ్గుతూ..పెరుగుతూ..

- ఎగువున పెరుగుతున్న గోదావరి ప్రవాహం
- ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం


ధవళేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి తగ్గుతూ పెరుగుతూ ప్రవహిస్తోంది. ఉపనదులు ప్రాణహిత, ఇంద్రావతి పరివాహకం న నుంచి వరద గోదావరికి చేరుతుండడంతో ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతుండగా ధవళేశ్వరం వద్ద తగ్గుతూ ప్రవహిసోంది. కాటన్ బ్యారేజ్ నుంచి మంగళవారం ఉదయం 6గంటలకు అత్యధికంగా 8,23,083క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండగా నీటి మట్టం 10.40అడుగులకు చేరుకుంది. ఆపై మధ్యాహ్నం 11గంటల వరకు అదే రీడింగ్ వద్ద నిలకడగా కొనసాగిన నీటి మట్టం తరువాత తగ్గుముఖం పడుతూ సాయంత్రానికి 9.90 అడుగులకు చేరుకోగా కాటన్ బ్యారేజ్ ద్వారా7,40, 578 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. బుధవారం ఉదయానికి 10 లక్షలకు చేరుకోవచ్చని అధికారుల అంచనా. ఎగువున భద్రాచలం వద్ద సోమవారం రాత్రి 8గంటల వరకు పెరిగిన నీటి మట్టం 38.30 అడుగులకు చేరుకుంది. ఆపై క్రమంగా తగ్గుతూ మంగళవారం సాయంత్రానికి 36.30 అడుగులకు చేరుకుంది.

దిగ్బంధనంలో గ్రామాలు

చింతూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వీడని ముసురు, ఎటు చూసినా వరద నీరే.. రోజంతా చలిగాలులు. దిగ్బంధనంలో గ్రామాలు, దీంతో లోతట్టు వాసులు ఇక్కట్లు పడుతున్నారు. సోమవారం రాత్రి చింతూరు వద్ద 33 అడుగులకు చేరుకున్న శబరి ఉధృతి మంగళవారం ఉదయం కాస్త తగ్గి 31 అడుగులకు చేరింది. తిరిగి మంగళవారం సాయంత్రానికి 33 అడుగులు దాటి ప్రవహిస్తోంది. అదే సమయంలో భద్రాచలం వద్ద 36.80 అడుగుల మేర ప్రవహిస్తోంది.దీంతో లోతట్టు వాసుల్లో ఆందోళన అలుముకుంది. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి 3.50లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయ డంతో గోదావరి ఉధృతి పెరిగింది. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవచ్చని అధి కారులు అంచనా వేస్తున్నారు. దీంతో శబరి ఉధృతి కూడా మరింత పెరగొచ్చని అంటున్నారు. శబరి ఉధృతితో ఛత్తీస్‌గడ్ ఒడిస్సాల నడుమ సుక్మా సమీపంలో నదిపై నిర్మించిన వంతెన నీట మునిగింది. అదే దశలో ఆంధ్రా-ఒడిస్సా 30వ జాతీయ రహదారి నిమ్మలగూడెం వద్ద నీట మునిగింది.చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారిపై చీకటి వాగు, సోకిలేరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చింతూరు-కూనవరం ప్రధాన రహదారిపై కొండ్రాజపేట వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ముసురు పట్టి రోజంతా వర్షం కురియడంతో చలి గాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. మంగళవారం కూడా చింతూరు మండలంలో 16 గ్రామాలు దిగ్బంధనంలోనే ఉన్నాయి. ఇదిలా వుండగా చింతూరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ప్రతి బుధవారం జరిగే గ్రీవెన్సును వరదలు, వర్షాల కారణంగా రద్దు చేస్తున్నట్టు పీవో అపూర్వ భరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర రహదార్లపై వరద నీరు చేరడంతో చింతూరు మండలం చట్టి వద్ద 30వ నెంబరు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించే వాహనాలన్నీ నిలిచిపోయి బారులుదీరాయి.


ధవళేశ్వరం బ్యారేజీ దిగువున ప్రవహిస్తున్న వరద నీరు


ఛత్తీస్‌గడ్-ఒడిస్సా రోడ్డులో సుక్మా వద్ద నీట మునిగిన వంతెన


చింతూరు: చట్టి వద్ద నిలిచిపోయిన వాహనాలు


చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారిపై వరద నీరు

కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఖాళీలను భర్తీ చేయాలి

- కేంద్ర కార్మిక శాఖ మంత్రిని కోరిన ఎంపీ సతీష్‌బాబు


మంత్రి మాండవియాతో సతీష్‌బాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉన్నందున ఖాళీలను భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మంగళవారం ఢిల్లీలో కేంద్ర కార్మిక, ఉపాధి యువజన, క్రీడా వ్యవహారాల శాఖల మంత్రి మాన్సుఖ్ మాండవియాను కలిసి కోరారు. 500 పడకల సామర్థ్యం ఉన్న కాకినాడ ఈఎస్ఐ ఆసుపత్రికి మొత్తం 205 పోస్టులు మంజూరుకాగా 88 కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో స్పెషలిస్టులు, సీనియర్ రెసిడెంట్స్, నర్సింగ్ ఆఫీసర్లు, టెక్నీషియన్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. సిబ్బంది కొరత వల్ల రోగులకు సమయానికి వైద్యం అందించడంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఖాళీలను తక్షణమే భర్తీ చేసి ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందించేలా చూడాలని మంత్రిని కోరారు.

ఖేలో ఇండియా ప్రాజెక్టులను పూర్తి చేయాలి.. అలాగే రాష్ట్రంలో జాతీయ క్రీడా ప్రావీణ్య కేంద్రాల ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న ఖేలో ఇండియా ప్రాజెక్టుల పూర్తి, ప్రతి జిల్లాలో అదనపు ఖేలో ఇండియా సెంటర్లు, రాయలసీమలో కొత్త ఎస్ఏఐ ట్రైనింగ్ సెంటర్ స్థాపన వంటి ప్రతిపాదనలను సమర్పించారు. ఈ మేరకు ఎంపీ సతీష్‌బాబు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వేదశాస్త్ర పండిత సన్మాన సభ

సామర్లకోట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో మంగళవారం బాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్ 27వ వేదశాస్త్ర పండిత సన్మాన సభ జరిగింది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఘనాపాఠీలు వచ్చి వేదాలు పఠించారు. పరిషత్ కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ ఈవో బళ్ల నీలకంఠం నేతృత్వంలో నిర్వహించిన సభకు హాజరైన పండితులు చతుర్వేద పారాయణ, వేదస్వస్తి నిర్వహించారు. అనంతరం పండిత సత్కారం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్, జ్యోతిషుడు చీమలకొండ ప్రసాద్, భీమే శ్వర అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి చుండ్రు గోపా లకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సింగవరపు సత్యనారాయణ, గుండు శంకరరావు, కాపుగంటి పైడిరత్నం, బుర్రే కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కన్నేసి.. స్థలం కబ్జా చేసి!

రాజమహేంద్రవరంలో ఐదుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): స్థలం కాజేసిన ఐదుగురిని రాజమహేంద్రవరం పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య మంగళవారం వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గొల్లపల్లి కాశీ విశాలాక్షి వైద్యురాలిగా పనిచేస్తుండేవారు. 1997లో తన కుమారులు గొల్లపల్లి వినోద్, గొల్లపల్లి లక్ష్మణ్ పేరున కవలగొయ్యి గ్రామ పరిధిలోని ఎస్ఆర్ నెం.496లో ప్లాటు నెం.39 ద్వారా 267చదరపు గజాలు.. దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలో ప్లాట్ నెం.204లో వినోద్ పేరున 267చ.గ., లక్ష్మణ్ పేరున ప్లాట్ నెం.203లో 267 చదరపు గజాల స్థలాన్ని కొన్నారు. ఆమె భర్త 2012లో మరణించడంతో తన స్వగ్రామం ఆకివీడు మండలం కుప్పనపూడి వెళ్లిపోయారు. తర్వాత కుమారులు ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. విశాలాక్షి కూడా అమెరికా వెళ్లారు. ఇటీవల స్వగ్రామం వచ్చి స్థలాలను ఒకసారి పరిశీలించుకుందామని రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అవి వేరొక వ్యక్తులకు క్రయంగా దాఖలు పడ్డాయని తెలియడంతో అవాక్కయ్యారు. దొంగ రిజిస్ట్రేషన్లు జరిగాయని గ్రహించి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో సీఐ కాశీ విశ్వనాథ్ టీం దర్యాప్తు ప్రారంభించింది. దీంతో పలు విషయాలు వెలుగు చూశాయి. రియల్ ఎస్టేటు బ్రోకర్లుగా ఉన్న మద్దిరెడ్డి లక్ష్మీ నారాయణ, మద్దిరెడ్డి నాగేంద్ర ప్రసాద్(సిటీ బస్సు ప్రసాద్)కి 2013 జనవరిలో షేక్ ఫకీర్ మహమ్మద్ ఖాసిం బాషా అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఏదైనా ఎక్కువ కాలం ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి తన దృష్టికి తెస్తే నకిలీ దస్తావేజులు తయారు చేసి అమ్ముకోవచ్చని, అధిక మొత్తంలో సొమ్ము వస్తుందని చెప్పాడు. వాళ్లు తమకు తెలిసిన రియల్ ఎస్టేటు వ్యాపారుల నుంచి విశాలాక్షి కుమారులకు సంబంధించిన ప్లాట్ల దస్తావేజు జిరాక్సులను తీసుకెళ్లి ఖాసింకి ఇచ్చారు. అతడు నకిలీ జిరాక్సు కాపీలతో ఒరిజినల్ దస్తావేజులను తయారు చేయించాడు. రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రేషను సమయంలో ధవళేశ్వరానికి చెందిన పాతూరి ప్రసాద్, సబ్బితి భాస్కరరావుకు రూ.20వేల చొప్పున ఇచ్చి వినోద్, లక్ష్మణ్‌గా నటింపజేసి రిజిస్ట్రేషను ప్రక్రియ పూర్తి చేశారు. రిజిస్ట్రారు కార్యాలయంలో ఏ విధంగా నడుచుకోవాలనే విషయంపై కొవ్వూరుకు చెందిన యాదగిరి సురేశ్, గాలి రాజేంద్ర ప్రసాద్‌తో తర్ఫీదు ఇప్పించారు. నకిలీ ఓటర్ ఐడీ కార్డులు, దస్తా వేజులతో మరికొందరితో కలిసి నకిలీ రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆపై వేరొకరికి విక్రయించేశారు. ఈ కేసులో షేక్ ఫకీర్ మహమ్మద్ ఖాసీం బాషా, మద్దిరెడ్డి లక్ష్మీ నారాయణ, మద్దిరెడ్డి నాగేంద్రప్రసాద్, సబ్బితి భాస్కరరావు, యాదగిరి సురేశ్‌ని అరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని డీఎస్పీ వివరించారు. ఖాళీ స్థలం కనబడితే కర్చీఫ్ వేసి కాజేస్తామంటే ఉపేక్షించేది లేదని, కబ్జా వ్యవహారాలపై పటిష్ఠ నిఘా పెట్టామని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. ఎక్కువ కాలం తమ స్థలాలను పట్టించుకోకుండా ఉండడం సరికాదని, పరిశీలించుకుంటూ ఉండాలని పేర్కొన్నారు. అయితే రిజిస్ట్రేషను ఎలా జరిగిందనే అంశంపై విమర్శలు, అప్పటి సబ్-రిజిస్ట్రారుపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు వినవస్తున్నాయి.

1 నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు


శ్రీలక్ష్మీనరసింహస్వామి

అంతర్వేది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రంలో సెప్టెంబరు 1 నుంచి 4 తేదీ వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. 1వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అంకురార్పణ, అధివాసములు.. 2,3 తేదీల్లో అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమాలు, పవిత్రారోహణ, 4వ తేదీ గురువారం ఉదయం మహాశాంతి హోమం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, రాత్రి పవిత్రఅవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పం, పవిత్రముల వినియోగం జరుగుతుందని ఏసీ తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ భాద్రపద శుద్ధ నవమి నుంచి ద్వాదశి వరకు స్వామివారి పవిత్రోత్సవాలు దేశ, రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, స్వామివారి దివ్యతేజో ప్రకాశములు కలగాలని, సర్వప్రాయశ్చిత్తార్థం పవిత్రోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని కోరారు.

శ్రీసిద్ధివినాయకుడి హుండీల ఆదాయం

రూ.44.11 లక్షలు


సిద్ధివినాయకుడి ఆలయంలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుడి హుండీలను మంగళవారం లెక్కించారు. 90 రోజులకు ఆలయ ప్రధాన హుండీ నుంచి రూ.42,81,1787, అన్నప్రసాద హుండీ నుంచి రూ.1,30,115 వెరసి మొత్తం రూ.44,11,902 నగదు, 173 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ నోట్లు 33 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ పేర్కొన్నారు. తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు, ట్రైనింగ్ సహాయ కమిషనర్ ఎం.మంజులాదేవి, జిల్లా దేవాదాయశాఖాధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. అర్చకులు, గ్రామస్తులు, ఆలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీపై సెన్సూర్ జరిమానా

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కొవ్వూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ టి.శ్రీనివాసులపై సెన్సూర్ జరిమానా విధించినట్టు ఎక్స్ అఫిషియో స్పెషల్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కొవ్వూరు ఏఎంసీలో సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా పనిచేసిన టి.శ్రీనివాసులు ప్రస్తుతం కాకినాడ జిల్లా కరప ఏఎంసీలో సెక్రటరీగా పనిచేస్తున్నారు. రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ఉన్న 2ఎగ్జిక్యూటివ్ పిటీషన్ కేసుల్లో ఉత్తర్వులు ఉన్నా ప్రతి వాది జీతం అటాచ్‌మెంటు చేయడంలో విఫలమైనందుకు సెక్రటరీ శ్రీనివాసులుపైనా అభియోగం మోపారు. భవిష్యత్‌లో ఇటువంటి తప్పులు పునరావృత్తం కాదని సెక్రటరీ హామీ ఇవ్వడంతో పాటు ఆర్టికల్ ఆఫ్ చార్జి నుంచి విముక్తి చేయాలని కోరారు. మొత్తం విషయాలను పరిశీలించిన అనంతరం ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనలు నియమం 9 ప్రకారం శ్రీనివాసులపై సెన్సూర్ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

దమ్ము ట్రాక్టర్ తిరగబడి ఇరుక్కున్న డ్రైవర్

గాయాలు.. ఆసుపత్రికి తరలింపు


ఇంజన్ భాగంలో ఇరుక్కున్న డ్రైవర్ విష్ణు

ఎటపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు దమ్ము ట్రాక్టర్ తిరగబడి స్టీరింగ్ భాగంలో డ్రైవర్ ఇరుక్కున్న ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గన్నవరం గ్రామానికి మోరంపల్లి విష్ణు గౌరిదేవిపేటలోని ఓ రైతు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వరినాట్లు సిద్ధం చేసేందుకు పొలాలను దమ్ము చేస్తున్నాడు. పొలంలో అక్కడక్కడ గోతులు ఉండడంతో దమ్ము ట్రాక్టర్ ఒక్కసారిగా తిగబడిపోయింది. డ్రైవర్ విష్ణు ట్రాక్టర్‌ను బయటికు తెచ్చేందుకు ప్రయత్నించే క్రమంలో ఇంజన్‌భాగం, స్టీరింగ్ మధ్య ఇరుక్కుపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి విష్ణును బయటకుతీశారు. గాయాలతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తర్వాత మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఓ ప్రయివేట ఆసుపత్రికి తరలించారు.

పెళ్లింట్లో అగ్నిప్రమాదం

వంట, వివాహ సామగ్రి పూర్తిగా దగ్ధం


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ

కపిలేశ్వరపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామశివారు సత్యనారాయణపురం (అగ్రహారం)లో మంగళవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో వాటాల సూర్యనారాయణ తాటాకిల్లు దగ్ధమైంది. సూర్యనారాయణ కుమారుడు పోసయ్య పెద్ద కుమార్తెకు గురువారం వివాహం కావాల్సి ఉండగా సోమవారం ఆమెను పెళ్లి కుమార్తెను చేశారు. దీంతో బంధువులతో ఇల్లు సందడిగా ఉన్న సమయంలో గ్యాస్‌పై వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించడంతో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. వంట, వివాహ సామగ్రి పూర్తిగా కాలిబూడిదైనట్టు రోజువారీ కూలీలైన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండపేట ఫైర్ ఆఫీసర్ ఎం.వెంకట్రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ అర్జమ్మ, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించి బాధితుల వివరాలను నమోదు చేశారు. బాధిత కుటుంబానికి తక్షణసాయంగా 25 కిలోల బియ్యం అందజేసినట్టు తహశీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మండపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ, కుటుంబంలో కలహాలతో కలత చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో మంగళవారం జరిగింది. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం... ద్వారపూడి శ్మశాన వాటికలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడు మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన మల్లేశ్వరపు వెంకటేశ్వరరావు(35)గా గుర్తించారు. అతడికి భార్యతో గొడవల కారణంగా ఆమె పిల్లలతో ఏడిదలోనే వేరుగా ఉంటుంది. వెంకటేశ్వరరావుకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. ద్వారపూడిలో శ్మశానవాటిక వెనక చెట్టుకు ఉరివేసుకోవడంతో కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. మృతుడి ప్యాంట్ జేబులో లభ్యమైన పుస్తకంలో తన మరణానికి తానే కారణమని, మరెవరు కాదని రాసి ఉందని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మండపేట రూరల్ ఎస్ఐ కిషోర్ కేసు నమోదు చేశారు.

బురద రోడ్డులో వరి నాట్లు వేసి నిరసన


రహదారిపై నాట్లు వేస్తున్న మహిళలు

ఎటపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏటా వర్షాకాలంలో బురద రహదారిలో పడుతున్న అవస్థలపై ఆదివాసీలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీలోని చింతల చెరువు గ్రామంలోని అంతర్గత రహదారి నడవడానికి వీల్లేకుండా బురదమయంగా తయారవడంతో మహిళలు వరి నాట్లు వేశారు. ఎన్నో ఏళ్ల నుంచి రహదారిని అభివృద్ధిపై అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతోందని పేర్కొన్నారు.

'ఏలేరు'లో పెరుగుతోన్న నీటి నిల్వలు


ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరులో జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. మెస్తారు వర్షాలు, గోదావరి జలాలు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు పెరుగుతోంది. ప్రాజెక్టులో నీటి నిల్వలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 525 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్న డూలేనిరీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 79.25 మీటర్ల స్థాయిలో 12.59 టిఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 200 క్యూసెక్కులు నీటిని సరఫరా చేస్తున్నారు.

జూజిట్సు క్రీడ జాతీయ రిఫరీగా అంజి


అంజికి నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు యాసిన్

అమలాపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన జూజిట్సు క్రీడకు జాతీయ రిఫరీగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన పడాల అంజి నియమితులయ్యారు. మార్షల్ ఆర్ట్స్‌లో ఒక భాగమైన జూజిట్సు క్రీడను ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక క్రీడగా ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఉర్దూ మాస్కన్ హాలులో నాలుగు రోజులు తెలంగాణ జూజిట్సు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోటీలు, అవగాహన తరగతులు నిర్వహించారు. అంజి కార్యక్రమంలో పాల్గొని నేషనల్ రిఫరీగా ఉత్తీర్ణులయ్యారు. అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి జూజిట్సు చాంపియన్ షిప్ పోటీలకు రిఫరీగా అంజి హాజరుకానున్నారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాసిన్, ప్రధాన కార్యదర్శి ఎన్.గురు ప్రభాకరరావు చేతులమీదుగా అందుకున్నారు.

రూ.150కే మేలు జాతి పాడి పశువుల వీర్యం

ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సమస్త కార్యనిర్వాహణాధికారి

శంఖవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రూ.150కే మేలు జాతి పాడి పశువుల వీర్యాన్ని అందజేస్తున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పశుగణాభివృద్ధి సమస్త కార్యనిర్వాహణ అధికారి కే.కాంతారావు తెలిపారు. పాడి పశువులకు కృత్రిమ గర్భధారణతో రైతులు ఆర్థికంగా లాభం పొందవచ్చిని చెప్పారు. మంగళవారం కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో పశు వైద్యశాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో పశుసంవర్ధకశాఖ కీలక పాత్ర పోషిస్తుందని, పాడిపశువుల పెంపకంలో మేలు జాతి పశువులే అధిక పాలు ఇస్తాయన్నారు. రైతులు ఆర్థికంగా బలోపేతం కావడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పాడి పశువులకు నాణ్యమైన మేలు జాతి పాడి పశువుల వీర్యాన్ని త క్కువ ధరలో అందజేస్తున్నట్టు తెలిపారు. గతంలో రూ.500 ధర ఉండగా ప్రస్తుతం రూ.150 కే అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రైతు పశుపోషణలో ఆధునిక పద్ధతులు పాటించాలని కోరారు.


కాకినాడ జిల్లా శంఖవరంలో మాట్లాడుతున్న కాంతారావు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో గాయని కౌసల్య

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య

తునిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ సినీ నేపథ్య గాయని కౌసల్య అన్నారు. కాకినాడ జిల్లా తునిలో శ్రీప్రకాష్ విద్యాసంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా 2 రోజుల పాటు విద్యాసంస్థల శాఖలైన తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం విద్యార్థులకు గాతా రహే మేరా దిల్ పేరిట పాట పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా గాయని కౌసల్య, కీబోర్డు ప్లేయర్ రవి శేఖర్ వ్యవహరించారు. కౌసల్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే ఇలాంటి కార్యక్రమాలు పాఠశాల యాజమాన్యం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అనంతరం తన పాటలతో అలరించారు. విజేతలు, అతిథులకు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ బహుమతులు అందజేశారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, వివిఎస్ఎస్ భాను మూర్తి, డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాజీ మంత్రి కన్నబాబుకు పితృ వియోగం


సత్యనారాయణ (ఫైల్)

సర్పవరం జంక్షన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు పితృ వియోగానికి గురయ్యారు. గత కొంతకాలంగా అనారోగ్య రుగ్మతలతో ఆయన తండ్రి సత్యనారాయణ (76) బాధపడుతున్నారు. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భౌతికకాయాన్ని వైద్యనగర్‌లో గల కన్నబాబు నివాసం వద్దకు తీసుకువచ్చారు. ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, గుడివాడ అమర్‌నాథ్, జోగి రమేష్, సీహెచ్.వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీలు వంగా గీత, చింతా అనురాధా, తోట నరసింహం, ఎం భరత్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జగ్గిరెడ్డి, జక్కంపూడి రాజా, టీడీపీ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి దంపతులు సత్యనారాయణ పార్థీవదేహానికి నివాళులర్పించారు. అనంతరం భౌతికకాయాన్ని భారీ ఊరేగింపుగా కాకినాడ ఆర్టీసీ సమీపంలో శ్మశానవాటికకు తీసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సంతాపం వ్యక్తం చేశారు.

కోడలితో గొడవ... ఇంటి నుంచి వెళ్లిపోయిన అత్త

కరప, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అత్తాకోడళ్ల మధ్య వివాదంతో మనస్తాపం చెందిన అత్త ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టకు చెందిన నురుకుర్తి సత్యనారాయణమ్మ, ఆమె కోడలు హిమబిందు మధ్య ఈ నెల 18న మధ్యాహ్నం ఏదో విషయంలో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరగడంతో కుటుంబ సభ్యులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో మనస్తాపం చెందిన సత్యనారాయణమ్మ ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడు శివశంకర్ మంగళవారం కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వీధికుక్కల దాడిలో 11 మేక పిల్లలు మృతి


మృతిచెందిన మేక పిల్లలు

ఎటపాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో 11 మేక పిల్లలు మృతి చెందిన ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురంలో జరిగింది. గ్రామానికి చెందిన బుద్దుల భద్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి కూలీ పనులకు వెళ్లారు. మేకల దొడ్డిలోని మేక పిల్లలపై వీధి కుక్కలు దాడి చేయడంతో 11మేక పిల్లలు మృతి చెందాయి. మేక పిల్లల విలువ రూ.1 లక్ష వరకు ఉంటుందని బాధితుడు భద్రయ్య తెలిపాడు.

బాలుడికి తీవ్ర గాయాలు

జగ్గంపేట రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గొల్లలగుంట గ్రామానికి చెందిన 4ఏళ్ల మహిమాన్విత్‌పై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఇంటి బయట ఆడుకుంటున్న మహిమాన్విత్‌ను వీధి కుక్కలు మెడ, తల భాగంపై తీవ్రంగా కరిచాయి. బాలుడి అరుపుతో తల్లిదండ్రులు కుక్కలను తరిమి బాలుడిని రక్షించుకున్నారు. తండ్రి రత్నరాజు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


కపిలేశ్వరపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో చిన్నవంతెన సమీపంలో ప్రధాన పంటకాలువలో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సుమారు 55 ఏళ్లు ఉండే వ్యక్తి మృతదేహాన్ని పైకి తీసి శవపంచనామా అనంతరం మండపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు అంగర ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు. వీఆర్వో సాకా సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఎవరైనా మిస్సింగ్ అయితే తమను సంప్రదించాలని కోరారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్

రౌతులపూడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన గండేపల్లి దుర్గాప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... గంజాయి కేసులో పరారీలో ఉన్న దుర్గాప్రసాద్‌ను రౌతులపూడి గ్రామశివారు మరిడమ్మ ఆలయం దగ్గర మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు ఉన్నారు.

మబ్బులు.. అందాలు

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో మంగళవారం ఆకాశం మేఘావృతమై కారు మబ్బులు కమ్ముకుని ప్రకృతి అందాలు కనువిందు చేశాయి – ప్రత్తిపాడు ఆంధ్రజ్యోతి



కృష్ణాష్టమి వేడుకలు

అమలాపురం టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సంస్కారభారతి జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం శ్రియా స్కూలులో దివ్యాంగులకు ప్రత్యేకంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణ, గోపికలు, రాధమ్మవేషధారణల పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

యానాం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):యానాం ప్రజలకు అధికారులు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనికాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఆర్దాని దినేష్ కోరారు. యానాం సిద్ధార్థనగర్‌లో కొన్ని నెలలుగా డ్రైనేజీతో త్రాగునీరు కలుషితం అవుతుందన్నారు.దీంతో అక్కడ ప్రాంతాన్ని ఆయన పరిశీలించి అనంతరం అధికారులకు సమస్యను విన్నవించారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర
- ప్రపంచ దోమల నివారణ దినోత్సవం



ముమ్మిడివరం: చేపలను చెరువులో వదులుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర



రాజోలు: కడలిలో మురికి గుంతలో గంబూసియా చేపలు వదులుతున్న వైద్య సిబ్బంది

ముమ్మిడివరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మలేరియా దోమల నివారణకు జిల్లాలోని 289ఆవాసాల్లో 2లక్షల గంబూసియా చేపలను విడుదల చేశామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మత్స్యశాఖ 2లక్షల గంబూసియా చేప పిల్లలను జిల్లాకు అందించిందని, వీటిని జిల్లాలోని 38 పీహెచ్‌సీల పరిధిలోని 132గ్రామాల్లోని 289ఆవాసాల్లో ఈ చేప పిల్లలను విడుదల చేశామన్నారు. తొలుత మంగళవారం అమలాపురంలోని ఈదరపల్లిలో చెరువులో గంబూసియాచేపలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర విడుదల చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు పీఎస్వీ రాజ్‌కుమార్, ఎస్.రాజబాబు, వై.ఆదినారాయణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, పీడీడీ బిషప్, ఎన్వీ రామారావు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మలేరియా పట్ల ప్రజలందరికీ అవగాహన కల్పించి వారిని అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర పేర్కొన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం వరల్డ్ మస్కిటో డే బ్యానర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా దోమలు వ్యాప్తి చెందకుండా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): గంబూసియా చేపలతో దోమల నిర్మూలన సాధ్యమవుతుందని అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు, లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డి.సత్యవతి అన్నారు. దోమల నివారణకు పాశర్లపూడి బాడవలో గంబూసియా చేపలను మంగళవారం విడుదలచేశారు. ఆదుర్రు, ఈదరాడ, లూటుకుర్రు గ్రామాల్లోని చెరువుల్లో గంబూసియా చేపలను విడుదల చేశామన్నారు. ఈకార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి వాసు, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, పీహెచ్‌సీసిబ్బంది పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): ఊడిమూడిలో నిల్వ ఉన్న నీటి గుంటల్లో దోమలను అరికట్టడానికి గంబూషియా చేపలను వదులుతున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్ గుంటల్లో చేపలను వదిలారు. గ్రామాల్లోని నీటిగుంటల్లో గంబూషియా చేపలను వదులుతున్నట్లు సిబ్బంది తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పి.యేసమ్మ, కొండ్రెడ్డి పద్మావతి, వైద్య సిబ్బంది ఎంపీ విజయకుమార్, ఎం.శ్యాముల్‌రాజు, పి.ఈశ్వరరావు, యశోద, క్రాంతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆదేశాలతో మంగళవారం ఉప్పలగుప్తం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చెరువులు, గోతుల్లో దోమల లార్వా నివారణకు గంబూషియా చేపలను వదిలారు. గొల్లవిల్లి యల్లారమ్మ చెరువులో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా గంబూషియా చేపలను విడిచిపెట్టారు. మలేరియా కారక దోమల లార్వా నివారణలో గంబూషియా చేపల పాత్ర ఎంతో కీలకమని వైద్యాధికారి లంకే నాగార్జున అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.విజయలక్ష్మి, హెచ్‌వీ కమల, హెచ్‌ఏలు డి.నాగేశ్వరరావు, జేవీవీ సత్యనారాయణ, ఏఎన్ఎం రాధ, ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): రాజోలు సబ్ యూనిట్ పరిధిలో గల ఆయా గ్రామాల్లో వర్షం నీరు నిల్వ ఉన్న గుంతల్లో దోమల లార్వా నివారణ కోసం గంబూసియా చేపలను ఆరోగ్య సిబ్బంది మంగళవారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ గంబూసియా చేపలు దోమల లార్వాలను, ప్యూపాలను తింటూ దోమల సంతానోత్పత్తిని నివారిస్తాయని వివరించారు. దోమల లార్వా శ్వాస తీసుకోవడానికి నీటి ఉపరితలంపైకి వస్తుంది. ఆ సమయంలో గంబూషియా చేపలు వాటిని వేగంగా తింటాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్వేది,(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వర్షం నీరు నిల్వ ఉన్న నీటి గుంటల్లో దోమల లార్వా నిర్మూలనకు గంబూసియా చేపలను వదిలినట్టు వైద్యాధికారులు తెలిపారు. సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో నీటిగుంటల్లో చేపలను వదిలారు. ఎస్వీవీఎస్ఎన్ మూర్తి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పీఎల్ఎన్ స్వామి, ఎం.బాలశంకర్, ఎ.కరుణ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

నిండుగా ప్రవహిస్తోన్న నదీపాయలు



ముమ్మిడివరం: లంక గ్రామాలు పరిశీలించి సూచనలిస్తున్న ఆర్డీవో మాధవి



పి.గన్నవరం: గంటిపెదపూడి బూరుగులంక నదీపాయలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

పి.గన్నవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు గోదావరి ఎగువన వరద నీరు భారీగా పోటెత్తడంతో దిగువన నదీపాయలు నిండుగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేను వరద నీరు తాకడంతో కనకాయలంక గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులకు గురవుతున్నారు. వరద నీటిలో ప్రయాణం చేయడానికి విద్యార్థులు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గంటిపెదపూడి శివారు బూరుగులంక నదీపాయపై నాలుగు లంక గ్రామాల ప్రజలు ఇంజన్ బోట్లపై రాకపోకలు సాగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన పెదమల్లంక, అనగర్లంక, అయోధ్యలంకల గ్రామస్తులు నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం బూరుగులంక నదీపాయతో పాటు మానేపల్లి శివారు పల్లిపాలెం, శివాయలంక నదీ పరివాహక ప్రాంతాలను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, స్థానిక తహశీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి పరిశీలించారు. మునిగిన కనకాయలంక కాజ్‌వేను పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. లంక గ్రామాల్లో వీఆర్వోలు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అలాగే పంచాయతీ కార్యదర్శులకు కూడా విధులు వేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద ముప్పు పొంచి ఉన్నందున లంక గ్రామాల్లోని లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిణి, ఆర్డీవో కె.మాధవి సూచించారు. ముమ్మిడివరం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన లంకాఫ్ ఠాణేలంక, కమిని పంచాయతీ పరిధిలోని గురజాపులంక గ్రామాలను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. గోదావరి వరద దృష్ట్యా ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. మంగళవారం సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక వెలువడే అవకాశం ఉన్నందున పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీసు అధికారులు 24గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తొలుత ముమ్మిడివరం నగరపంచాయతీ రాజుపాలెంలో అక్రమ చెరువుల తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదుమేరకు ఆమె అక్కడకు వెళ్లి ఆ చెరువులను పరిశీలించారు. ఆమె స్థానిక అధికారులతో మాట్లాడారు. ఆమె వెంట వరదల సహాయక ప్రత్యేక అధికారి డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, తహశీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య, మండల ప్రత్యేకాధికారి బి.గౌతమ్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్, ఫిషరీస్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి : మంత్రి సుభాష్

- అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం
- డాగూరేకు నివాళులు



అమలాపురం: నడిపూడిలో బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపంలో ఫొటోగ్రాఫర్స్‌తో మంత్రి సుభాష్

అమలాపురం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. ఫొటోగ్రాఫర్లు ఆధునిక సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి మేలు చేకూర్చేవిధంగా చర్యలు తీసుకుంటానన్నారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నడిపూడి బాబూ జగ్జీవన్‌రామ్ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఫొటోగ్రాఫర్ల యూనియన్ పతాకాన్ని సంఘ గౌరవాధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆవిష్కరించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగేరూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షుడు గెడ్డం సురేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముందుగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అధికారి జయవెంకటలక్ష్మి, దున్నాల దుర్గ పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సుభాష్ దృష్టికి ఫొటోగ్రాఫర్ల సమస్యలను తీసుకువచ్చారు. అనంతరం అసోసియేషన్ తరఫున మంత్రి సుభాష్, ఎమ్మెల్యే ఆనందరావులను ఘనంగా సత్కరించారు. యూనియన్ మాజీ గౌరవాధ్యక్షుడు, సీనియర్ ఫొటోగ్రాఫర్ ఖ్వాజాబాబును సత్కరించారు. ముందుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ రమేష్(బాబి), కటకం కృష్ణ, యల్లమిల్లి శివకుమార్, రెడ్డి శ్రీనివాస్, వియ్యూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులిస్తా: ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఉప్పలగుప్తం మండల కార్యాలయ భవన నిర్మాణానికి నిధులిస్తానని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఫొటోగ్రాఫర్లకు హామీ ఇచ్చారు. మంగళవారం గొల్లవిల్లి శ్రీభీమేశ్వరా ఆడిటోరియంలో మండల ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తన హయాంలో భవనానికి స్థలం కేటాయించానన్నారు. గత అయిదేళ్ల కాలంలో నిర్మాణం జరగలేదన్నారు. భవనాన్ని నిర్మించి ఫొటోగ్రాఫర్లకు బహుమతిగా ఇస్తానన్నారు. మహిళలకు, వృద్ధులకు ఆయన దుస్తులు పంపిణీ చేశారు. ఆయనను ఫొటోగ్రాఫర్లు సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నాటిసెయింట్ గూటం, సంఘ కార్యదర్శి జాన భవానీశంకర్, సంఘ జిల్లా అధ్యక్షుడు గెడ్డం సురేష్‌కుమార్, ప్రధానకార్యదర్శి సంగుల దొరబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కూటమినాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, అరిగెల నానాజీ, అడబాల సత్యనారాయణ, మద్దింశెట్టి సీతారామస్వామి, చీకట్ల ఏసు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, ఎంపీటీసీ దోనిపాటి బాలమ్మ, సొసైటీ అధ్యక్షుడు మంచెం బాలకృష్ణ, ఫొటోగ్రాఫర్ల సంఘసభ్యులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రఫీ డేను ముమ్మిడివరంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం పురవీధుల్లో మోటారు సైకిల్‌తో భారీ ర్యాలీని నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా స్థానిక విష్ణాలయం సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఫొటోగ్రాఫర్ల పతాకాన్ని ఆవిష్కరించారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల సభ్యులు పాల్గొన్నారు.

డాగూరేకు నివాళులు..

ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు నలమాటి శివ ఆధ్వర్యంలో ముమ్మిడివరం పోలమ్మ చెరువుగట్టున ఫొటోగ్రఫీ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలమ్మ చెరువుగట్టున కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాసరావు, జి.చైతన్యకుమార్, దాసరి గౌతమ్‌రెడ్డి, బాబి, యోగి, ధర్మతేజ, ఉదయ్, కిశోర్, మోజెష్, త్రిమూర్తులు, రాజేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మామిడికుదురులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కోటి, హీరు, ఆదినారాయణమూర్తి, పుల్లారావు, రామకృష్ణపాల్గొన్నారు.

కాట్రేనికోన,(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన గేట్ సెంటర్‌లో మంగళవారం ఫొటోగ్రాఫర్ల యూనియన్ మండల అధ్యక్షుడు సంసాని అర్జున్ ఆధ్వర్యంలో లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఓలేటి సత్యం, జిల్లా సభ్యుడు జి.సురేష్, మట్టా నాగేంద్ర, ఆర్.కాసులు, వినోద్, మున్నా, రామారావు, మణికంఠ, మూర్తి, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం సురేష్ కోరారు. ఫొటోగ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా పి.గన్నవరం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత మండల వ్యాప్తంగా యూనియన్ సభ్యులు భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్విడెక్టు వద్ద గల కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీవీరావు, యాళ్ల ధనరాజు, ఫొటోగ్రాఫర్స్ యూనియన్ మండల గౌరవాధ్యక్షుడు ఆర్కే రామకృష్ణ, అధ్యక్షుడు పెనుమాల బాలాజీ, కార్యదర్శి శివకుమార్, గూటం శ్రీనివాస్, మెల్లం వెంకన్న, షేక్ దొరబాబు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపంలో జరిగిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కాలానుగుణంగా టెక్నాలజీలో వచ్చిన మార్పులను ఫొటోగ్రాఫర్లు అణ్వయించుకుంటూ ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ప్రజలకు అందిచాలన్నారు. వరల్డ్ ఫొటోగ్రఫీ అవార్డు గ్రహీత బీర అశోక్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, సీవీ రావు, మీనన్, నల్లి శ్రీను, జెస్సీ, రత్నం, శేఖర్ పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని మంగళవారం అంబాజీపేటలో మండల ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ఆర్.భీమరాజు, ఎస్ఐ కె.చిరంజీవి పాల్గొన్నారు. ఈసందర్భంగా పతాకాన్ని సీఐ ఆవిష్కరించారు. యూనియన్ అధ్య క్షుడు యనమదల వెంకటరమణమూర్తి, గౌరవ అధ్యక్షుడు గంటా వెంకటగిరి, ఉపాధ్యక్షుడు మట్టపర్తి రాము, కార్యదర్శి పిల్లి వీరప్రతాప్, కోశాధికారి కొప్పిశెట్టి శ్యామ్‌ధనవరప్రసాద్, జాయింట్ సెక్రటరీ నెల్లి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రాల నిర్వాహకుల జేఏసీ ఏర్పాటు

అంతర్వేది, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మాఘమాసంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో అన్నదాన సత్రాల నిర్వహణ అత్యంత ప్రధానమైనది. మంగళవారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయం వద్ద అన్నదాన సత్రాల నిర్వాహకులు జేఏసీగా ఏర్పాటయ్యారు. అధ్యక్షుడిగా కలిదిండి సుబ్బరాజు, గౌరవాధ్యక్షుడిగా వి.సత్యనారాయణ, జె.రామ్మోహనరావు, సహ అధ్యక్షుడుగా వై.సింహాచలం (బుజ్జి), ప్రధాన కార్యదర్శి బాసా రవికుమార్, కోశాధికారిగా నేదునూరి సత్యనారాయణమూర్తి (సత్తిబాబు), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎల్వీ రాజు, కార్యదర్శులుగా ఉలిశెట్టి లక్ష్మణరావు, సీతారత్నం, సహాయ కార్యదర్శిగా డీవీవీఎన్ రాజు(విజయ్) ఎన్నికయ్యారు. అన్నదాన సత్రాల నిర్వహణలో సమస్యలను, వాటి పరిష్కారాలపై చర్చించుకున్నారు. సుమారు 65సత్రాలు ఉండగా వాటిలో 50మంది నిర్వాహకులు జేఏసీ సమావేశానికి హాజరైనట్టు వారు తెలిపారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన చెక్క సాయివెంకటేష్ రూ.10,000లు విరాళాన్ని మంగళవారం ఆలయ సిబ్బందికి అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

అక్విడెక్ట్‌పై వంతెన జాయింట్లకు మరమ్మతులు

పి.గన్నవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం అక్విడెక్ట్‌పై ఎక్స్‌పేన్సన్ జాయింట్ల వద్ద స్ట్రిప్ స్టీల్‌సీట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఇరిగేషన్ డీఈ ప్రసాదరాజు తెలిపారు. జాయింట్ల వద్ద గత కొంత కాలంగా అక్విడెక్ట్‌పై ఎక్స్‌పేన్సన్ జాయింట్లు సరైన రీతిలో లేకపోవడంతో గోతులు ఏర్పడి అస్తవ్యస్తంగా తయారవుతున్నాయని ఆయన అన్నారు. జాయింట్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టడానికి రూ.20 లక్షలతో ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపామన్నారు.

వసతిగృహానికి వాషింగ్‌మెషిన్ బహూకరణ

మామిడికుదురు, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): అమలాపురం కోఆపరేటివ్ సొసైటీ రిజిస్టర్ ఎం.ఏసునాయన వాషింగ్‌మెషిన్‌ను మామిడికుదురులోని బాలికల వసతిగృహానికి అందించారు. ఈసందర్భంగా హెచ్ఎం బి.చిరంజీవిరావు మాట్లాడుతూ విద్యార్థుల కష్టాలు చూసి స్పందించిన దాత ఔదార్యాన్ని కొనియాడారు. ఉపాధ్యాయులు మట్టా నాగరాజు, డి.సత్యనారాయణ, బీహెచ్ మనోహర్‌రాజు, బళ్ల శ్రీను, చొప్పల గోపిపాల్గొన్నారు.

పాపన్నగౌడ్ జయంతి

కాట్రేనికోన, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): పాపన్నగౌడ్ 375వ జయంతిని మంగళవారంగొరగనమూడిలో జరుపుకున్నారు.పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేస్తామని అభిమానులు ప్రకటించారు. కొండేటి బాబీగౌడ్, మట్ల వెంకన్నగౌడ్, మట్ల రమేష్‌గౌడ్, కొండేటి శ్రీనివాస్‌గౌడ్, వాకా నాగయ్యగౌడ్, అంగర బాబీగౌడ్, గుడేల ప్రసాద్‌గౌడ్, వీరి గౌతమ్‌గౌడ్ పాల్గొన్నారు.

ముంపు నీరు దిగేలా చర్యలు చేపట్టాలి

కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

పి.గన్నవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): వరి పొలాల్లో భారీ వర్షాలకు కారణంగా నిలిచిపోయిన ముంపు నీటిని బయటకు పంపే విధంగా చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ ఆదేశించారు. పి.గన్నవరం, పోతవరం ప్రధాన రహదారి చెంతనే ఉన్న డ్రెయిన్‌ను మంగళవారం ఆయన పరిశీలించి స్థానిక అధికారులకు సూచనలు చేశారు. ముంపునీరు నిల్వ ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అనంతరం స్థానిక పంట కాల్వల గురించి ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో వెంట ఇరిగేషన్ డీఈ ప్రసాదరాజు, జేఈ ఎ.నాయుడు, ఆర్ఐ వర్మ తదితరులు ఉన్నారు.

గాంధీ విగ్రహావిష్కరణ

అంతర్వేది, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం పంచాయతీ వద్ద డిస్ట్రిక్ట్ 202ఏ రీజియన్-2, జోన్-1 అంతర్వేది క్లబ్ గవర్నర్ అధికారిక పర్యటన సందర్భంగా మంగళవారం వాసవీమాతకు శ్రావణమాస సారెను అందించామని క్లబ్ సభ్యులు తెలిపారు. అనంతరం పంచాయతీ వద్ద గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. క్విజ్ పోటీలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి పిల్లలకు పుస్తకాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చల్లగండ్ల ప్రసాద్, క్యాబినేట్ సెక్రటరీ చలపతి, క్యాబినేట్ ట్రెజరర్ చల్లగండ్ల వెంకటేశ్వర్లు, రీజియన్ చైర్‌పర్సన్ వంకాయల శ్యామల, జోన్ చైర్మన్ అప్పన్న బద్రి, అంతర్వేది క్లబ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు, అప్పన సుబ్బారావు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార సదస్సు

మలికిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మలికిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఈనెల21న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్స్ కె.రాంబాబు మంగళవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ పాల్గొంటారని, వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై కమిటీకి తెలియచేయవచ్చన్నారు.

నేడు ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాక

ముమ్మిడివరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ బుధవారం అమలాపురం విచ్చేస్తున్నందున మాల సంఘాల నాయకులు, మాలల జేఏసీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం అమలాపురం ఎంపీడీవో కార్యాలయంలో విజయ్‌కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారని, ఆయనకు సూచనలు, సలహాలు ఇచ్చి మాలల ఆర్థికాభివృద్ధికి తోడ్పడేందుకు మాల సంఘాల నాయకులు, మాలల జేఏసీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని అశోక్ కోరారు.

వేడుకగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

అల్లవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరు సీతారామాలయంలో మంగళవారం సామూహిక వరలక్ష్మి వ్రతం వేడుకగా జరిగింది. మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. భజరంగ్‌దళ్ ప్రముఖ్ రాజశేఖర్, జిల్లా సంపర్క్ ప్రముఖ్ భమిడిపాటి కృష్ణమూర్తి, ధర్మరక్షక్ గోపాలకృష్ణ, అల్లు సత్తిబాబు, వాసర్ల అప్పారావు, గూడాల పుల్లయ్యశెట్టి, బాలం సతీష్, బొంతు నాగేశ్వరరావు, కాండ్రేగుల త్రిమూర్తులు, కట్టా బుజ్జి పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో మాధవి

మామిడికుదురు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద తీవ్రత క్రమేణా పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీవ కె.మాధవి సూచించారు. మంగళవారం ఆమె వరద ప్రభావిత ప్రాంతాలైన పాశర్లపూడిలోని కాజ్‌వేను, అప్పనపల్లి స్నానాలరేవు వద్ద వరద తీవ్రతను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మండల పరిధిలోని అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్య, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులపై అవగాహన చేసుకోవాలని సూచించారు. తహశీల్దార్ సునీల్‌కుమార్, వ్యవసాయాధికారి ఎన్వీవీ సత్యనారాయణ, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఆర్ఐ ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

అంబాజీపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఆసుపత్రి అభివృద్ధికి రూ.1.13లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. వీటి ద్వారా ఆసుపత్రికి ఉపయోగపడే పరికరాలు కొనుగోలు చేస్తామన్నారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీఎల్ నరసింహం, తహశీల్దారు చినబాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయాలి



కొబ్బరి పీచు బొమ్మల గురించి కేంద్రమంత్రికి వివరిస్తున్న ఆక్సిజన్ అసోసియేషన్ సభ్యులు

మామిడికుదురు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలోని కొబ్బరి పీచు బొమ్మలు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలను మరింత అభివృద్ధి చేయాలని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ సహాయమంత్రి శోభా ఖరాండ్లేజ్‌ను ఆక్సిజన్ అసోసియేషన్ సభ్యులు కలిసి విన్నవించారు. మంగళవారం అసోసియేషన్ సభ్యులు మంత్రిని ఢిల్లీలో కలిసి క్వాయిర్ పరిశ్రమల అభివృద్ధి, చేతి పనుల అభివృద్ధికి మద్దతు ఇచ్చే కొత్త శిక్షణ, క్వాయర్ షోరూం మార్కెటింగ్ మద్దతు గురించి చర్చించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం, బీజేపీ జాతీయ మహిళామోర్చా ఆఫీస్ ఇన్‌చార్జి దీపిక, అల్లు దుర్గామణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్ర హోమం

ఐ.పోలవరం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): మురమళ్లశ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి శ్రావణ ఆరుద్ర నక్షత్ర సందర్భంగా మంగళవారం రుద్ర హోమం నిర్వహించారు. అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతిపూజ, మండపారాధన, రుద్రహోమం,పూర్ణాహుతి నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పరిశీలించారు.

కిమ్స్‌లో దివ్యాంగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు

అమలాపురం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉచితంగా కిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేస్తామని కిమ్స్ వైద్యుడు డాక్టర్ పి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఈదరపల్లిలోని హరిమనో వికాస కేంద్రంలో కిమ్స్ వైద్యుల బృందం ఆధ్వర్యంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ, చిన్నపిల్లల వైద్యులు, చర్మవ్యాధుల విభాగంలో 55మంది దివ్యాంగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేకించి స్పీచ్ ఎంఆర్ ఆర్థో విభాగంలో దివ్యాంగులను పరీక్షించారు. వారిలో శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా కిమ్స్ ఆసుపత్రిలో చేస్తామని డాక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో హరి మనోవికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాజశేఖర్, డైరెక్టర్ ఎస్.రాజ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి సన్నిధిలో గజ్జె కట్టిన చిన్నారులు

ఐ.పోలవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం చిన్నారులు గజ్జె కట్టి కూచిపూడి భరతనాట్యం శిక్షణకు శ్రీకారం చుట్టారు. శ్రీదత్తసాయి కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో మురమళ్లలో చిన్నారులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి 50మంది చిన్నారులు ఏకాదశి పురస్కరించుకుని స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పురోహితులు గజ్జెలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అకాడమీ నిర్వాహకులు హైమావతి చిన్నారులకు గజ్జెలు అందించారు. అనంతరం ఆలయంలో సామూహిక నాట్యప్రదర్శన చేశారు.

వరి చేలలో జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపు బారిన పడినవరిచేలల్లో రైతులు జాగ్రత్తలు పాటించాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.గిరిజారాణి, సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ సూచించారు. అంబాజీపేట మండలంలో నీటమునిగిన వరి చేలను శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ముంపు బారిన పడిన పంట పొల్లాలో నీటిని మళ్లించేందుకు చర్యలుచేపట్టాలన్నారు.

చేలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్త

కాట్రేనికోన, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఏరువాక శాస్త్రవేత్త ఎం.నందకిశోర్, ముమ్మిడివరం ఏవో జె.మనోహర్, కాట్రేనికోన ఏవో బి.మృదుల మంగళవారం చెయ్యేరులో నీట మునిగిన పొలాలను పరిశీలించారు. రైతులకు సూచనలు చేశారు. మునిగిన మొక్కలు చనిపోతే మనేదలు వేసుకోవాలి. పిలకదశలో చేలు పుంజుకోవడానికి వీలైనంత త్వరగా నీరు తీసివేసి, ఎకరాకు 20కిలోల యూరియా, 10-15కిలోల పొటాష్ అదనంగా వెయ్యాలి. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1.0గ్రా కార్బెన్డిజమ్ లేదా 2.0 గ్రా కార్బెన్డిజమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చెయ్యాలి.

అయోమయంలో రైతులు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో వందలాది ఎకరాల వరి చేలు ముంపు బారిన పడ్డాయి. చెయ్యేరు రంగరాజుకోడు, గొరగనమూడి, ఓల్డ్‌అయినాపురం, గెద్దనపల్లి, పల్లంకుర్రు డ్రెయిన్లతో పాటు మండలంలోని 33 మైనర్ డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో పొలాల్లోని పైరు కుళ్లిపోతోందని రైతులు భయపడుతున్నారు. మండలంలో 456ఎకరాల్లో పొలాలు నీట మునిగినట్టు అధికారుల అంచనా.

చినుకుల వాతావరణం

మలికిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చినుకులు పడుతూనే ఉన్నాయి. ప్రజలు తమ పనులను చేసుకోని విధంగా చిరు జల్లులకు తోడు ఈదురుగాలులు తోడయ్యాయి. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోని పలు ప్రాంతాల్లో రొయ్యల చెరువులు ఆక్సిజన్ లోపంతో పట్టుబడికి వచ్చాయి. నెల రోజుల క్రితం వేసిన చెరువుల నుంచి పెద్ద కౌంట్‌లకు వాతావరణ మార్పుల వల్ల ఇబ్బందులు రావడంతో రైతులు అయినకాడికి అమ్ముకుంటున్నారు.

పెరుగుతోన్న వరద ప్రవాహం

యానాం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): యానాంలో వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు యానాం జీఎంసీ బాలయోగి వారధి వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పలు పర్యాటక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు వరద ముంపునకు గురయ్యాయి. వర్షాలకు యానాంలో బెజవాడగార్డెన్స్‌లో భారీ వృక్షం నేల కొరిగింది. వరద పరిస్థితిపై అధికారులతో పరిపాలనాధికారి మునిస్వామి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

మండపేట

జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఆర్డీవో



హెచ్‌ఎం రాజ్యలక్ష్మితో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

కపిలేశ్వరపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలను రామచంద్రపురం ఆర్డీవో అఖిల మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల అదనపు తరగతి గదులను పరిశీలించారు. తరగతి గదుల్లో శ్లాబ్‌ల నుంచి వర్షం నీరు కారడం, పెచ్చులూడిపోవడం గమనించి పాఠశాల గ్రాంటును వినియోగించి మరమ్మత్తులు చేసుకోవల్సిందిగా ఆమె సూచించారు. దాతల సహకారంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంఈవో కె. తాతారావు, విజయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, ఇంజనీరింగ్ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కృష్ణాజిల్లా ప్రసాదంపాడుకు చెందిన దార్ల శ్రీనివాససాయిప్రసాద్, కుసుమశ్రీ దంపతులు రూ.52,500, ఒడిషా భువనేశ్వర్‌కు చెందిన దండు తనీష్‌వర్మ, హనీష్‌వర్మ రూ.25,116 విరాళాలు సమర్పించారు. బుధవారం స్వామివారికి సమర్పించిన హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

21న వెంకన్న దివ్యకల్యాణం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవం గురువారం సాయంత్రం భీమవరం పట్టణంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉపకమిషనరు తెలిపారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం ఎఎస్‌ఆర్ నగర్ భీమవరంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

గోదావరి ఉధృతితో రైతుల్లో కలవరం



రావులపాలెం మండలం గోపాలపురం వశిష్ట వంతెన వద్ద గోదావరి ప్రవాహం

కె.గంగవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి వదులుతున్న వరద జలాలతో కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. స్థానిక పుష్కరాల రేవులోని పై మెట్ల వరకు వరదనీరు చేరుకుంది. ఫెర్రీ రేవులో ర్యాంపుపై వరకు వరద నీరు చేరుకుని నిండుకుండను తలపిస్తోంది.

పోటెత్తుతున్న గోదావరి

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ని గౌతమి, వశిష్టపాయల్లో వరద నీరు ఉధృ తంగా ప్రవహిస్తున్నది. నదీ పరీవాహక ప్రాంత పంట పొలాల్లోకి వరదనీరు చేరుతోంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. బడుగువానిలంక భూముల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లోని వాణిజ్య పంటలు వరద నీటికి మునిగిపోతున్నట్టు రైతులు చెబుతున్నారు. వరద ఉధృతి మరింత పెరిగితే లంక భూములకు నష్టం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బడుగువానిలంక, మడికి, చెముడులంక, చొప్పెల్ల, జొన్నాడ, మూలస్థానం, ఆలమూరు లంక భూ ముల్లో వేలాది ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగవుతున్నాయి. గోదావరి వరద కారణంగా జొన్నాడ వద్ద పుష్కర్‌ఘాట్‌లోకి వరద నీరు చేరింది. రెండు వంతెనల మధ్య గోదావరి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరద ఉధృతిపై రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



ఆలమూరు మండలం జొన్నాడ పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి ఉధృతి

22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

ఆత్రేయపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 22న ఉదయం ర్యాలి జగన్మోహిని కేశవస్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఈవోలు తెలిపారు. మహిళలు తమ పేర్లు, గోత్రాలను 20వ తేదీలోపు ఆలయంలో నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీవో పర్యటన

కపిలేశ్వరపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో రామచంద్రపురం ఆర్డీవో అఖిల మంగళవారం పర్యటించారు. గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో కపిలేశ్వరపురం, తాతపూడి, కేదార్లంక గ్రామాల్లోని వరద పరిస్థితిపై ఆమె సమీక్షించారు. కేదార్లంక పుష్కరాల రేవు, కాజ్‌వే బ్రిడ్జిని ఆమె పరిశీలించి అక్కడ పరిస్థితులను రెవెన్యూ, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తొలుత కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపును పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. స్టాకు పాయింట్ నుంచి ఇసుక తరలింపుపై రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఏవో బి.రవి, కేదార్లంక గ్రామ సర్పంచ్ వి.వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ వై.నాగేశ్వరరావు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

మండపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం ప్రాణాలు పోవటానికి ప్రధాన కారణం ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడక పోవటమేనని మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు అన్నారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని దీనిపై వారికి ప్రతిరోజూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. మంగళవారం జెడ్.మేడపాడు జంక్షన్‌లో పలు వాహనదా రులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఆయన వెంట రూరల్ ఎస్ఐ కిషోర్ తదితరులు వున్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దొర్రాజు

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

వినియోగదారులకు మండపేట డీఈఈ శ్రీధర్ హితవు



ఆలమూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు పడుతున్నందున విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో మండపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.శ్రీధర్ సూచించారు. నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాల వల్ల తీసుకోవలసిన చర్యలను ఆయన వివరించారు. వర్షం సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రిక్ తీగలు, ఇతర కరెంట్ పరికరాల దగ్గర ఉండవద్దన్నారు. తడిచేతులతో ఇంట్లోని ఎలక్ట్రికల్ స్విచ్‌లను ఆన్ ఆఫ్ చేయడం ప్రమాదానికి దారితీస్తాయన్నారు. ఇంట్లోని పలు ఇనుపవస్తువులను బహిరంగ ప్రదేశాల్లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు పడిపోయి వుంటే వాటిని తాకవద్దని, వెంటనే 1912కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర పిల్లలు ఆటలు ఆడుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి ఆయన తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో వెదురుపాక విజయదుర్గా అమ్మవారు

విజయదుర్గా అమ్మవారికి శ్రావణ మంగళవారం పూజలు

రాయవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణ మాసం మంగళవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులతో సామూహిక శ్రీచక్ర కుంకుమార్చన జరిపి నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపారు. శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు కాలువల వద్ద గంగమ్మకు పూజలు, గౌరిపూజలు చేశారు. పీఠంలో జరిగిన కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బి.రమ, బుజ్జి, పీఠం పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.

మనోహర్ మృతి తీరనిలోటు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యు మాజీ నేత మనోహర్ మృతి తీరని లోటని పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకుడు వి.భీమశంకరం, పీవైఎల్ నాయకుడు అంబటి కృష్ణ, ఐఎఫ్‌టీయు నాయకుడు చింతా రాజారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని, ఆయన మృతి బాధాకరమన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రజా పోరాటాలను మరింత ముందుకు తీసుకువెళతామని వక్తలన్నారు.



పేకేరులో పాడుబడిన బావిలో గమ్‌బుష్ చేపలు వేస్తున్న వైద్య సిబ్బంది

దోమల నియంత్రణకు గమ్‌బుష్ చేపలు

కె.గంగవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దోమల లార్వాను నియంత్రించడానికి వైద్య శాఖ సిబ్బంది పాడుబడిన బావుల్లో మంగళవారం గమ్‌బుష్ చేపలు వేశారు. పేకేరు, దంగేరు ఆసుపత్రి పరిధిలోని ఆయా గ్రామాల్లో పర్యటించి ఉపయోగంలో లేని బావులు, నీటిగుంతలు, చెరువుల్లో గమ్‌బుష్ చేపలు వదిలారు. కార్యక్రమంలో పేకేరు బాబ్జి, ఆసుపత్రి వైద్యులు శ్రీలక్ష్మి, రేఖారాణి, సిబ్బంది పీవీవీఎస్ఎన్ మూర్తి, రాజశేఖర్, కాంతారావు, గుడాల శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల కమిషన్ తీరు విచారకరం'

రావులపాలెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ వ్యవస్థ అనేది మరిచిపోయి కేంద్ర ఆధీన సంస్థగా పనిచేస్తున్నదని మెర్ల శాస్త్రులు అన్నారు. బీహార్‌లో 65 లక్షల ఓట్ల తొలగింపు అనేది కేంద్ర ఎన్నికల కమిషన్ స్కామే అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలే ఇందుకు నిదర్శనమన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

పొలం పిలుస్తోందిలో రైతులకు అధికారుల విజ్ఞప్తి

రాయవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం, లొల్ల గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ రమేష్ కుమార్ మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు మాత్రమే యూరి యా వాడాలన్నారు. అన్నదాత సుఖీభవ ఫిర్యాదుల నమోదు ఈనెల 20తో ముగుస్తుందన్నారు. అర్హత కలిగిన రైతులు రైతు సేవా కేంద్రం పరిధిలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సోమేశ్వరం పీఏసీఎస్ ఛైర్మన్ శాకా కోటేశ్వరరావు, జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు శాకా నాగేంద్ర, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎస్.గంగరాజు, వ్యవసాయ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఫొటోగ్రఫీ సృష్టికర్తకు ఘన నివాళి

కె.గంగవరం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గంగవరం శ్రీముఖ డిగ్రీ కళాశాలలో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ జాక్సన్ డాగురె చిత్రపటానికి వారు నివాళులర్పించారు. కుందూరు ప్రాథమిక ఆసుపత్రిలో రోగులకు, భవిత కేంద్రంలోని విద్యార్థులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పలివెల శ్రీనుబాబు, సభ్యులు అంబటి సుబ్రహ్మణ్యం, సీనియర్ ఫొటోగ్రాఫర్ కె.కనక రత్నం, మోర్త సంతోష్, శీలం మణికంఠ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



డాగురె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

పీఎంఆర్ పుస్తకం ఉపాధ్యాయులకు దిక్సూచి

ఆలమూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్‌టీయూ ఉపాధ్యాయ అధ్వర్యంలో ముద్రించిన పీఎంఆర్ పుస్తకాన్ని మండల విద్యాశాఖాధికారి బి.అప్పాజీ మంగళవారం ఆవిష్కరించారు. విద్యార్థుల ప్రగతి, గ్రేడుల నమోదు చేయడానికి ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఉపాధ్యాయులందరికి అవసరమయ్యే ఈ పుస్తకాన్ని ఉచితంగా ఇస్తున్న ఎస్‌టీయు మండల శాఖను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు సలాది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వాసా దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు కెఎస్ఎన్ మూర్తి, రాజగోపాల్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



పీఎంఆర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవో అప్పాజీ



గంగవరంలో సతీష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

భవిత కేంద్రంలో రాజ్యసభ ఎంపీ పుట్టినరోజు వేడుకలు

కె.గంగవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం భవిత కేంద్రంలో పార్టీ నాయకులు నిర్వహించారు. కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి ఆధ్వర్యంలో నాయకులు భవిత విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం భవిత కేంద్రంలోని విద్యార్థులకు భోజనం పెట్టారు. కార్యక్రమంలో యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యం, కుందూరు సొసైటీ అధ్యక్షుడు జగతా రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, మరివాడ సూరిబాబు, సలాది రమేష్, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, తరపట్ల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు ఎన్ని వచ్చాయి..ఎంత ఖర్చు చేశారు?

• మండల సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల నిలదీత • మండపేటను రాజమహేంద్రవరంలో కలిపేందుకు ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండపేట మండల పరిషత్ నాలుగేళ్లలో ఎంతమేర నిధులు వచ్చాయి, వాటిని ఎలా వ్యయం చేశారంటూ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, ఎంపీడీవోలను ప్రశ్నించారు. నాలుగేళ్లలో మండల పరిషత్‌కు సంబంధించి రూ.2కోట్లమేర నిధులు వ్యయం చేశామని అధికారులు తెలిపారు. అయితే ఆ నిధులతో ఏయే పనులు చేశారన్న దానిపై ఎంపీపీ సమాధానం చెప్పలేక పోయారు. ఆ నిధుల్లో టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? అని ప్రశ్నించగా ఎంపీపీతో పాటు అధికారులు నీళ్ల నమిలారు. వైస్ ఎంపీపీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో తమకు గుర్తింపులేదని నిధులు కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ నుంచి తనకు ఇచ్చే నిధులు గ్రామాల్లో డ్రైన్ల కోసం వ్యయం చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. మండపేట మండల పరిషత్ సమావేశం ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. దీనికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజర య్యారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువ ఉందని వాటి పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీలంతా మండపేట మండలాన్ని రాజమండ్రిలో కలిపేందుకు ఏకగ్రీవ తీర్మానం చేసి ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులను ఆయన అభినందించారు. మండపేట నియోజక వర్గాన్ని రాజమండ్రిలో కలపటం ఖాయమన్నారు. ఈ అంశాన్ని మంత్రివర్గం దృష్టికి తీసుకు వెళ్లానని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యే చొరవను ప్రశంసిస్తూ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆయన్ను సత్కరించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. మండపేట ఏడిద రోడ్డుకు మరమ్మతులు చేయాలని వైస్ ఎంపీపీ నాగబాబు కోరారు. మరో వైస్ ఎంపీపీ గజ్జారపు రమణ మాట్లాడుతూ ఎంపీటీసీలకు నిధులు కేటాయించటంతోపాటు ప్రోటోకాల్ పాటించాలని కోరారు. సమావేశం మధ్యలో ఎమ్మెల్యే వ్యక్తిగత పనులపై వెళ్లగా ఆయన వెంట అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లిపోవటంతో మండల సమావేశంలో సమస్యలపై చర్చలు ముగియకుండానే ముగిసింది. సమావేశంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు, ఎంఎసీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, వైస్ ఎంపీపీలు, నాగేశ్వరరావు రమణ, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, తదితరులతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు పాలకవర్గాలు పనిచేయాలి

ఆలమూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోనున్న నవజనార్దనస్వామి ఆలయ నూతన పాలకవర్గం ధర్మ పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు. ఇటీవల నూతనంగా నియమించిన పాలకవర్గ అధ్య క్షుడు బైరిశెట్టి రాంబాబుతోపాటు పాలకవర్గ సభ్యులు మంగళవారం శ్రీనివాస్‌ను కలసి అభి నందించారు. ఈనెల 24న జరిగే పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని కోరారు. నూతన పాలకవర్గం ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గారపాటి శ్రీనివాస్, కృష్ణంరాజు, నల్లా వెంకటేశ్వరరావు, సలాది జయప్రకాష్‌నారాయణ, చల్లా బాబి, కట్టా రాజు, చల్లా వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి శ్రీనివాస్, కాలా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



జనార్దనస్వామి ఆలయ పాలకవర్గం దృశ్యం

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



కొత్తపేటలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్లు

కొత్తపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగూరే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంఘ అధ్యక్షుడు గంధం పెద్దిరాజు, పి.శ్రీను, డి.శ్రీను, వై.శివకళ్యాణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గెడ్డం సురేష్, ఎన్.వెంకటేశ్వరరావు, కె.బంగ్రారాజు, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఫొటోగ్రాఫర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రావులపాలెంలోని బ్రైయిట్ లైట్ అంధుల పాఠశాలలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

ఓట్ చోర్‌పై కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో భాగంగా కొత్త పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు ఆధ్వర్య ంలో ఓట్ చోర్, గద్దీ చోడ్ నినాదాలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రావులపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ పాలన సాగించడానికి ప్రధాని మోడీ పాత్ర కీలకమైతే దానికి ఎన్నికల కమిషన్ కూడా సాయం అందించడం దోహదమన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ గ్రంధి శేషగిరిరావు, కుప్పాల రాంబాబు, పల్లి విజయకుమార్, కోట వాసు, ఊడిమూడి పల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన చెక్క సాయి వెంకటేష్ రూ.10,000 విరాళాన్ని మంగళవారం ఆలయ సిబ్బందికి అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.



మాట్లాడుతున్న ఏవో సద్గురుమూర్తి

పంట నమోదు చేయించుకోండి

కె.గంగవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి ఏ.సద్గురుమూర్తి అన్నారు. మంగళవారం భట్లపాలిక, మసకపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ డివిజన్ ట్రైనర్ బాబూరావు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రహ్మపురి సొసైటీ చైర్మన్ గెడ్డం పల్లపురావు, వీఏఏ రాజ్‌కుమార్, సత్యవేణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో అన్నదాన సత్రాల నిర్వహణకు జేఏసీ ఏర్పాటు

అంతర్వేది, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మాఘమాసంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో అన్నదాన సత్రాల నిర్వహణ అత్యంత ప్రధానమైనది. మంగళవారం అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద అన్నదాన సత్రాల నిర్వాహకులు జేఏసీగా ఏర్పాటయ్యారు. అధ్యక్షుడిగా కలిదిండి సుబ్బరాజు, గౌరవాధ్యక్షుడిగా వి.సత్యనారాయణ, జె.రామ్మోహనరావు, సహ అధ్యక్షుడుగా వై.సింహాచలం, ప్రధాన కార్యదర్శి బాసా రవికుమార్, కోశాధికారిగా నేదునూరి సత్యనారాయణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎల్వీ రాజు, కార్యదర్శులుగా ఉలిసెట్టి లక్ష్మీణరావు, సీతారత్నం, సహాయ కార్యదర్శిగా డీవీవీఎస్ రాజు ఎన్నికయ్యారు. అన్నదాన సత్రాల నిర్వహణలో సమస్యలను, వాటి పరిష్కారాలపై చర్చించుకున్నారు. సుమారు 65 సత్రాలు ఉండగా వాటిలో 50 మంది నిర్వాహకులు జేఏసీ సమావేశానికి హాజరైనట్టు తెలిపారు.

'దివ్యాంగ పింఛన్లు తొలగించే కుట్ర'

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్లు తొలగించే కుట్ర జరుగుతోందని దివ్యాంగుల హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు ఆరోపించారు. అనర్హుల ఏరివేత పేరుతో జిల్లాలో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు ప్రభుత్వం తొలగించిందన్నారు. జిల్లాలో అన్ని దివ్యాంగుల సంఘాల నాయకులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అర్హులైన దివ్యాంగులు పింఛన్లు కోల్పోతే 99124 95088లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కొత్తపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20 నుంచి పలు విభాగాల కోర్సులకు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు కోరారు. తమ డిగ్రీ కళాశాలలో 8 రకాల విభాగాల కోర్సులు నడుస్తున్నాయని ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు కళాశాల ప్రవేశానికి అర్హులన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పాటు లైబ్రరీ, రీడింగ్ రూమ్స్ వంటి ఆధునిక సౌకర్యాలు ఉన్న కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.